
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
5
సోమవారం 8 డిసెంబరు 2025



మహా.. రుద్రాభిషేకం

కోటప్పకొండ(నరసరావుపేట), డిసెంబరు 7: ఆరుద్రోత్సవం సందర్భంగా కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వర స్వామికి మహన్యాస పూర్వక మహా రుద్రాభిషేకాలు శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు నేత్రపర్వంగా జరిగాయి. ఆవు పాలు, పెరుగు, నెయ్యి, తేనె, పంచదార, విభూది, గంధం, కుంకుమ, తైలం, సుగంధ ద్రవ్యాలు, ఫలాలతో అభిషేకాలు నిర్వహించారు. స్వామికి అన్నాభిషేకం వైభవంగా జరిగింది. పాతకోటేశ్వర స్వామి దేవాలయం వద్ద అర్ధరాత్రి కర్పూర జ్యోతి దర్శనం చేసుకుని భక్తులు పులకించారు. ఉదయం యాగశాలలో లక్ష్మీగణపతి, రుద్ర, శాంతి, వాస్తు హోమాలు నిర్వహించి పూర్ణాహుతి చేశారు. జ్యోతి దర్శనం అనంతరం మేధా దక్షణామూర్తి స్వాములు దీక్ష విరమించారు.


పాలాభిషేకం


పెరుగుతో..



నెయ్యితో..


పసుపుతో..


కుంకుమతో..


విభూదితో..


గంధంతో..


చెక్కరతో..


అన్నాభిషేకం


శ్రీ పాత కోటేశ్వర స్వామి మూలవిరాట్‌కు విశేష అలంకారం

నేడు రావిపాడు చర్చి పండుగ

నరసరావుపేట రూరల్, డిసెంబరు 7: మండలంలోని రావిపాడు గ్రామంలోని అమలోద్భవిమాత మహోత్సవం సోమవారం జరగనున్నది. సోమవారం ఉదయం నుంచి ప్రత్యేక ప్రార్థనలు జరగనున్నాయి. సాయంత్రం 4 గంటల నుంచి వాహనాలు, పశువులను పూజించనున్నారు. 5 గంటలకు కొవ్వొత్తులు, కానుకలు సమర్పణ, రాత్రి 10 గంటల నుంచి బాణసంచా, మేళ తాళాల మధ్య ప్రార్థనా గీతాలాపనలతో అమలోద్భవి మాత తేరు ప్రదక్షిణ కార్యక్రమాలు జరగనున్నాయి. ఈ వేడుకలు తిలకించేందుకు రావిపాడు గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలిరానున్నారు. చర్చి పండుగ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ఠ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు రూరల్ సీఐ ఎం.సుబ్బారావు తెలిపారు.


విద్యుత్ అలంకరణలో అమలోద్భవి చర్చి

పదిలో మెరుగైన ఫలితాలే లక్ష్యం

● వంద రోజుల ప్రణాళిక పరిశీలనలో డీఈవో చంద్రకళ

సత్తెనపల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో జిల్లాలో ఉత్తమ ఫలితాలు సాధించడమే లక్ష్యమని డీఈవో ఎల్ చంద్రకళ తెలిపారు. వంద రోజుల ప్రణాళిక పరిశీలనలో భాగంగా ఆదివారం సత్తెనపల్లి, సుగాలీ కాలనీ, సరస్వతి శిశు మందిర్, నందిగామ జడ్పీ ఉన్నత పాఠశాలల్లో స్టడీ అవర్స్‌ను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడారు. జిల్లాలో 471 హైస్కూల్స్‌లో 26,160 మంది పబ్లిక్ పరీక్షలకు సిద్ధమవుతున్నారన్నారు. ఉత్తీర్ణత శాతం పెంచేందుకు శనివారం నుంచి వంద రోజుల ప్రణాళిక అమలు చేస్తున్నామన్నారు. సబ్జెక్టుల వారీగా షెడ్యూల్ రూపొందించి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 8 నుంచి 9 వరకు, మధ్యాహ్నం 2:30 నుంచి 4 గంటల వరకు విద్యార్థులను ప్రత్యేకంగా చదివించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. సాయంత్రం 4 నుంచి 5 గంటలలోగా పరీక్ష నిర్వహించి అక్కడే జవాబు పత్రాలను మూల్యాంకనం చేసి ఎవరెవరికి ఎన్ని మార్కులు వచ్చాయో కూడా లీప్ యాప్‌లో ఉపాధ్యాయులు నమోదు చేయాలన్నారు.


సత్తెనపల్లిలోని బాలికల ఉన్నత పాఠశాలలో స్టడీ అవర్స్‌ను పరిశీలిస్తున్న పల్నాడు జిల్లా డీఈవో ఎల్ చంద్రకళ

పర్యవేక్షణకు కమిటీలు

వంద రోజుల ప్రణాళిక అమలు కోసం పర్యవేక్షణకు జిల్లా, మండల స్థాయిలో ప్రతీ సబ్జెక్టుకు నలుగురు ఉపాధ్యాయులతో కమిటీలు ఏర్పాటు చేశామన్నారు. వీరు వారానికి రెండు రోజుల పాటు పర్యటిస్తూ ప్రణాళిక అమలు తీరు, విద్యార్థుల ప్రగతిపై అంచనా వేస్తూ ఫలితాల సాధనకు తీసుకోవాల్సిన చర్యల గురించి సూచనలు ఇస్తారన్నారు. ఆయా పాఠశాలల్లో ఉత్తమ ఫలితాల సాధనకు తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. డీఈవో వెంట ఎంఈవో శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

హోర్డింగ్‌లతో.. హడల్

● ప్రమాదకరంగా ప్రకటనల బోర్డులు

పదుల అడుగుల ఎత్తులో వేలాడున్న హోర్డింగ్‌లు హడలెత్తిస్తున్నాయి. ప్రమాదకరంగా ఉన్న బోర్డులు ఎప్పుడు ఎవరిపై పడతాయోనని ప్రజలు భీతిల్లిపోతున్నారు. విద్య, వ్యాపార కేంద్రాలైన గుంటూరు నగరంతో పాటు గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలో హోర్డింగ్‌లకు డిమాండ్ ఉంది. ఇదే అవకాశంగా పలువురు అనధికారికంగా హోర్డింగ్‌లను ఏర్పాటు చేశారు. మున్సిపాల్టీల అనుమతి తీసుకుంటే ప్రత్యేకంగా చార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. అలా చార్జీలు చెల్లించకుండా అధికారులకు మామూళ్లు సమర్పించుకుని ఎక్కడంటే అక్కడ ఎలాగంటే అలాగ.. నిబంధనలు పాటించకుండా ఏర్పాటు చేస్తున్న వ్యాపార ప్రకటనల బోర్డులు ప్రమాదాలకు నెలవుగా ఉంటున్నాయి. వర్షాలు, గాలుల సమయంలో బోర్డులు పడిపోయి పలువురు గాయపడుతున్నా అధికారులతో పాటు హోర్డింగ్‌ల నిర్వాహకులకు పట్టడంలేదు.

● పట్టణాల్లో అనుమతి లేకుండా ఏర్పాటు
● ఆదాయాలు కోల్పోతున్నా పట్టని మున్సిపాల్టీలు
● నిబంధనలకు విరుద్ధంగా ఎక్కడంటే అక్కడ ఏర్పాటు
● ప్రకటనలకే పరిమితమైన జరిమానా, చర్యల హెచ్చరికలు

(ఆంధ్రజ్యోతి - న్యూస్‌నెట్‌వర్క్)

మున్సిపల్ పట్టణాలు, గుంటూరు నగర పరిధిలో విద్య, వాణిజ్య ప్రకటనల బోర్డులకు పెద్దఎత్తున డిమాండ్ ఉంది. దీంతో మున్సిపల్, ప్రభుత్వ స్థలాలతో పాటు రోడ్లు, డ్రెయిన్లు ఆక్రమించి విచ్చలవిడిగా హోర్డింగ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. డివైడర్లపై, రోడ్ల మలుపుల్లో తక్కువ ఎత్తులో ఏర్పాటు చేస్తున్న ప్రకటనల బోర్డులతో ప్రమాదాలు సర్వసాధారణంగా మారాయి. కొందరు దళారులు సిండికేట్‌గా మారి అధికారులను మామూళ్లతో లోబరుచుకుని ప్రభుత్వ స్థలాలతో పాటు ప్రైవేటు భవనాలపై అనధికార హోర్డింగ్‌లు ఏర్పాటు చేసి అందిన కాడికి దండుకుంటున్నారు. ప్రకటనల బోర్డులతో యాడ్ ఏజెన్సీల నిర్వాహకులు రూ.లక్షల్లో అక్రమంగా సంపాదిస్తుండగా అందులో టౌన్‌ప్లానింగ్ అధికారులకు భారీగా ముడుపులు ముడుతున్నట్లు ఆరోపణలున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా, ప్రమాదకరంగా ఏర్పాటు చేస్తున్న హోర్డింగ్‌లతో ప్రకృతి వైపరీత్యాల సమయాల్లో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రోడ్ల మధ్య, జంక్షన్లలో భారీ హోర్డింగ్‌లు ఏర్పాటు చేయకూడదనే నిబంధన ఉన్నా ఎవరికీ (మిగతా 7లో)

ఆంధ్రజ్యోతి ఫోకస్

జేబులు నింపుతున్నాయి

హోర్డింగ్‌లు.. ప్రకటనల బోర్డులు.. స్థానిక సంస్థ ఖజానాలను నింపాలి. కానీ కొంతమంది అధికారుల జేబులు నింపుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా.. ప్రమాదకరంగా.. ఎక్కడంటే అక్కడ భారీ హోర్డింగ్‌లు ఏర్పాటు చేస్తున్నా అధికారులకు పట్టడంలేదు. పదుల సంఖ్యలో అనుమతులు తీసుకుని వందల సంఖ్యలో హోర్డింగ్‌లు ఏర్పాటు చేస్తున్నా అడిగే నాథుడు లేడు. రూపాయి కూడా చెల్లించకుండా రోడ్ల మార్జిన్లలో, షాపుల ముందు, డివైడర్ల మధ్యలో, జంక్షన్లలో ప్రకటనల బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు.



అద్దె భవనాల్లోనే.. ఆఫీసులు

మూడున్నరేళ్లు దాటినా వీడని కష్టాలు

అరకొర వసతుల మధ్య ఉద్యోగుల అవస్థలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఇరుకు గదుల్లోనే జిల్లా కార్యాలయాలు.. జిల్లా అధికారుల నియామకాలు లేవు.. అరకొర వసతుల మధ్య ఉద్యోగుల అవస్థలు.. కొత్త జిల్లా ఏర్పాటుతో పరిపాలన అందుబాటులోకి వస్తుందని ఆశ పడిన ప్రజలు పాలనపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇదీ మూడున్నరేళ్లగా జిల్లాలోని పరిస్థితి. పల్నాడు జిల్లా ఆవిర్భవించి మూడున్నరేళ్ల గడిచినా పరిపాలన ఇంకా గాడిలో పడలేదు. వైసీపీ ప్రభుత్వం జిల్లా ఏర్పాటు చేసి చేతులు దులుపుకుంది. కనీస వసతులు కల్పించడాన్ని విస్మరించింది. పూర్తి స్థాయిలో కార్యకలాపాలు జరగడం లేదు. ఆఫీసుల్లో కనీస వసతులు లేక ఉద్యోగులు.. ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. ప్రైవేట్ భవనాల్లో నిర్వహిస్తున్న కార్యాలయాలకు ప్రభుత్వం చెల్లిస్తున్న అద్దె చాలక సొంతంగా చెల్లించాల్సిన దుస్థితిని అధికారులు ఎదుర్కొంటున్నారు. కలెక్టరేట్, పోలీసు కార్యాలయం, కలెక్టర్, ఎస్పీ నివాసాలకే వసతులు పరిమితమయ్యాయి. కొన్ని కార్యాలయాలకు నేటికి కనీసం ఫర్నీచర్ కూడా ఇవ్వలేదు. రూ.100 కోట్లతో ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ నిర్మాణానికి ప్రణాళికను రూపొందించినా ఆచరణలో కనిపించడంలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జిల్లాలో పరిస్థితులు మెరుగుపడతాయని అధికారం యంత్రాంగం, ప్రజలు ఆశించారు. అయితే ఏడాదిన్నర గడిచినా జిల్లా కేంద్రంపై దృష్టి సారించలేదు. గత ప్రభుత్వం జిల్లా అధికారుల పోస్టులను మంజూరు చేసినా నియామకాలను విస్మరించింది. ఇంజనీరింగ్‌కు సంబంధించిన శాఖల్లో ఈఈ స్థాయి అధికారే ఎస్ఈగా విధులు నిర్వహిస్తున్నారు. ఏపీడీలే పీడీలుగా పని చేస్తున్నారు. ఇలా ఒక అధికారి రెండు పోస్టులను నిర్వహించాల్సి ఉండటంతో వారు ఏ ఉద్యోగానికి న్యాయం చేయలేక పోతున్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో కీలక పాత్ర వహిస్తున్న పోలీసుశాఖకు ఆయుధాలు భద్రపరిచే వసతి కూడా లేదు. దీంతో గుంటూరులోనే ఆయుధాలు ఉంచాల్సిన వస్తుంది. జిల్లాలో ఎక్కడైనా పెద్ద సంఘటన జరిగితే జిల్లా కేంద్రం నుంచి బలగాలను పంపించే సౌకర్యం కూడా లేదు. పోలీసుశాఖకు సంబంధించి ఎస్పీ, ఏఎస్పీ కార్యాలయాలు మినహా ఇతర ఆఫీసులు పూర్తి స్థాయిలో ఏర్పాటు కాలేదు. ఏఆర్‌కు సంబంధించి కొందరు గుంటూరు నుంచి వచ్చిపోతున్నారు. డీసీఆర్‌బీ, ఎస్‌బీకి సంబంధించి కూడా పూర్తిస్థాయిలో కార్యకలాపాలు జరగడంలేదు. పోలీసుశాఖకు సంబంధించిన అన్ని విభాగాల నిర్వహణకు సరిపడా వసతులు కేటాయించాలని సదరు అధికారులు కోరుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. కలెక్టరేట్‌లో కొనసాగుతున్న జేసీ, డీఆర్‌వో, సర్వే, సీపీవో కార్యాలయాలకు పూర్తిస్థాయిలో వసతులు కల్పించలేదు. ఆర్‌బీకే, సచివాలయం, విలేజ్ క్లినిక్ భవనాల్లో వ్యవసాయశాఖ కార్యాలయాలను ఏర్పాటు చేశారు. దీంతో క్లినిక్‌లో రోగులకు వైద్యసేవలు అందించేందుకు వైద్య సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు.


నరసరావుపేటలో అద్దె భవనంలో ఆరు కార్యాలయాలు

మీ కోసం.. కాల్ సెంటర్

సద్వినియోగం చేసుకోవాలన్న కలెక్టర్

నరసరావుపేట టౌన్, డిసెంబరు 7 (ఆంధ్ర జ్యోతి): మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని కలెక్టర్ కృతికాశుక్లా ఓ ప్రకటనలో తెలిపారు. అర్జీలు పరిష్కారం కాకపోయినా లేదా ఫిర్యాదులకు సమాచారం తెలుసు కునేందుకు అర్జీదారులు 1100 నంబరుకు ఫోన్ చేయవచ్చన్నారు. అర్జీలను నమోదు చేసుకోవడానికి మీకోసం డాట్ ఏపీ డాట్ జీవోవీ డాట్ ఇన్ వెబ్‌సైట్‌లో అర్జీదారులు నమోదు చేసుకోవచ్చన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలకు పరిష్కారం పొందాలన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. రిపీటెడ్ అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించిన స్లిప్పును తీసుకురావాలన్నారు. సమస్య పరిష్కారమైనప్పుడు ఫోన్‌కి మెసేజ్ వస్తుందని పరిశీలించుకోవాలన్నారు. నోటీసులు, ఎండార్స్‌మెంట్‌ను వాట్సాప్‌లో పంపిస్తున్నామని తెలిపారు. ఎండార్స్‌మెంట్‌లను రిజిష్టర్ పోస్టులో అర్జీదారులు సూచించిన చిరునామాకు పంపిస్తున్నామన్నారు.

సంతృప్తిలో.. రెవెన్యూ లోటు

● పీజీఆర్ఎస్‌కు అధికంగా రెవెన్యూ సమస్యలు ● ఏళ్ల తరబడి తిరుగుతున్న బాధితులు ● పరిష్కారం చూపని అధికారులు



నల్లపాడు శివారులోని గొర్రెల మండి వెనక సర్వే నంబరు 554లో దుగ్గెంపూడి వెంకటప్పారెడ్డికి చెందిన రెండెకరాల భూమి ఉంది. అందులోని కొంతభాగం 15 ప్లాట్స్ వేసి విక్రయించారు. మిగిలిన భూమి సర్వే చేయమని అర్జీదారుడు కృష్ణారెడ్డి(వెంకటప్పారెడ్డి మనవడు) రెండేళ్లుగా పీజీఆర్ఎస్‌లో అర్జీలు ఇస్తున్నా.. రెవెన్యూ అధికారులు స్పందించడం లేదు.

- ఫిరంగిపురం మండలంలోని 113 తాళ్లూరుకు చెందిన దాసరి లలితకుమారి ఉపాధి కోసం కువైట్ కు వెళ్లి.. తిరిగొచ్చేసరికి తన ఇంటిని బంధువులు ఆక్రమించారు. దీనిపై చర్యలు తీసుకోవాలని ఆమె కొన్నేళ్లుగా ప్రతి సోమవారం పీజీఆర్ఎస్‌కు వచ్చి అర్జీ అందజేస్తున్నారు.
- ప్రత్తిపాడు మండలంలోని చినకోండ్రుపాడుకు చెందిన పంతగాని సంసోన్ అనే వ్యక్తి తన భూమిని ఒక రాజకీయ నాయకుడు ఆక్రమించుకొన్నాడని తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నా పట్టించుకొనే నాథుడే కరువయ్యారు.
- పెదకాకాని మండలంలోని తక్కెళ్లపాడు గ్రామంలో కడప స్వర్ణకుమారి తన 498 చదరపు గజాల భూమిని రెవెన్యూ అధికారులు వ్యవసాయ భూమిగా మార్చి వేరే వాళ్లకు పట్టాలు ఇచ్చారని, దీనిపై తాను కొన్నేళ్ల నుంచి ఉన్నతాధికారులను కలిసి ఫిర్యాదు చేస్తున్నా.. పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

చిలకలూరిపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పబ్లిక్ గ్రీవియన్స్ రీడ్రెసెల్ సిస్టమ్ (పీజీఆర్ఎస్)కి అత్యంత ప్రాధాన్యం ఇచ్చి అర్జీదారుల ఫిర్యాదులను పరిష్కరించాలని ప్రభుత్వం పదేపదే చెబుతోంది. జిల్లాస్థాయిలో మాత్రం ప్రతి సోమవారం జరిగే ఈ కార్యక్రమం ఒక మొక్కుబడి తంతులా మారింది. ప్రతి అర్జీ పరిష్కారానికి నిర్ణీత వ్యవధి ఉంది. నిబంధనల ప్రకారం పీజీఆర్ఎస్‌కు వచ్చే అర్జీలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి పరిష్కరించాలి. అవి మళ్లీ రీఓపెన్ కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత సంబంధిత విభాగాల అధికారులదే. గణాంకాల్లో అంతా సవ్యంగా ఉందని ప్రభుత్వానికి నివేదించడంపైనే అధికారులు ఎక్కువగా దృష్టి పెడుతున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అర్జీలను ఫిర్యాదిదారు సంతృప్తి మేరకు పరిష్కరించాలి. ఒకవేళ నిబంధనలకు విరుద్ధంగా ఉంటే అదే విషయాన్ని తెలియజేసి కంప్లయింట్‌ని సంబంధిత వ్యక్తి ఆమోదం తీసుకొని మూసేయాలి.

పట్టించుకోని రెవెన్యూ అధికారులు

గ్రీవియన్స్ ఎక్కువగా (మిగతా 7లో)

వారానికి ఒకసారే తాగునీరు

● 22 ఏళ్లుగా ఎస్ఆర్‌కేటీ కాలనీలో సౌకర్యాలు కరువు ● కలెక్టరేట్‌కు మూడు కిలోమీటర్ల దూరంలో సమస్యల తిష్ఠ

నరసరావుపేట రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణ శివారులోని ఎస్ఆర్‌కేటీ కాలనీలో కనీస సౌకర్యాల కల్పన అటు అధికారులకు ఇటు ప్రజాప్రతినిధులకు పట్టడంలేదు. కాలనీవాసులకు తాగునీరు వారానికి ఒకసారి మాత్రమే అందుతుందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఇక 22 ఏళ్ల క్రితం ఏర్పడిన కాలనీలో నేటికీ రోడ్లు లేవు. డ్రైయినేజి వ్యవస్థ ఏర్పాటు చేయలేదు. కలెక్టరేట్‌కు మూడు కిలోమీటర్ల దూరంలోని ఈ కాలనీలో సమస్యలు తిష్ఠ వేసి ఉన్నాయి. 22 ఏళ్ల క్రితం అప్పటి టీడీపీ ప్రభుత్వంలో పేదలకు ఇళ్లు నిర్మించి అందజేసింది. అ తర్వాత ఈ కాలనీలో ప్రజలకు అవసరమైన కనీస మౌలిక వసతుల కల్పనలో పాలకులు విఫలమయ్యారు. తాగునీరు, రోడ్లు వంటి కనీస మౌలిక వసతులు లేక కాలనీవాసులు దుర్భర జీవనాన్ని గడుపుతు న్నారు. వారానికి ఒకసారి వచ్చే మున్సిపాలిటీ ట్యాంకర్‌తో సరఫరా చేసే నీటిపైనే కాలనీవాసులు ఇప్పటికీ ఆధారపడి ఉంటున్నారు. ఈ నీటిని నిల్వ ఉంచుకుని వారం రోజులు వినియోగించుకోవాల్సి వస్తుందని కాలనీవాసులు వాపోతున్నారు. ట్రాక్టర్ వచ్చిన సమయంలో ఇళ్లలో లేకపోయినా, నీరు పట్టుకోలేకపోయినా వారం మొత్తం నీటికోసం తిప్పలు పడాల్సి వస్తుందని తెలిపారు. జలజీవన్ మిషన్ ద్వారా రూ.36 లక్షలతో కాలనీలో ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణం చేపట్టారు. అయితే ఒక్కరోజు మాత్రమే నీటిని వదిలారని కాలనీవాసులు చెప్తున్నారు. ప్రస్తుతం ఇది నిరుపయోగంగా మారింది. కాలనీలో మొత్తం 18 లైన్లు ఉండగా కేవలం కొన్ని లైన్లు మాత్రమే సీసీ రోడ్లు నిర్మించి మిగిలిన లైన్లు నేటికి మట్టి రోడ్లుగానే ఉండిపోయాయి. దీంతో చినుకుపడితే ఆ రోడ్లన్నీ బురదమయంగా మారుతున్నాయి. వీధి దీపాలు వెలగక అంధకారంలో కాలనీవాసులు తీవ్రంగా ఇక్కట్లు పడుతున్నారు. ఇక విషసర్పాల సంచారంతో ప్రజలు భయ భ్రాంతులకు గురవుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుకుంటున్నారు.


ట్యాంకర్ నీటిని పట్టుకుంటున్న కాలనీ ప్రజలు

దిక్సూచి

పారా మిలటరీ పిలుస్తోంది

ఎస్ఎస్‌సీ భారీ నోటిఫికేషన్



స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ) - పారా మిలటరీలో 25,487 ఉద్యోగాలతో భారీ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది.

పోస్టుల వివరాలు: కానిస్టేబుల్(జీడీ), రైఫిల్‌మన్(జీడీ), సెక్రటేరియట్

ఖాళీల వివరాలు: బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్(బీఎస్ఎఫ్) - 616, సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్(సీఐఎస్ఎఫ్) - 14,595, సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్(సీఆర్‌పీఎఫ్): 5,490, సశస్త్ర సీమా బల్(ఎస్ఎస్‌బీ) - 1,764. ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్(ఐటీబీపీ) - 1,293, అస్సాం రైఫిల్స్(ఏఆర్) - 1,706, సెక్రటేరియట్ సెక్యూరిటీ ఫోర్స్(ఎస్ఎస్ఎఫ్) - 23

అర్హత: వచ్చే ఏడాది జనవరి 1 నాటికి పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి.

వయసు: వచ్చే ఏడాది జనవరి 1 నాటికి వయస్సు 18-23 సంవత్సరాల మధ్య ఉండాలి(2003 జనవరి 2కి ముందు 2008 జనవరి 1 తరవాత జన్మించి ఉండకూడదు). రిజర్వుడు వర్గాలకు సడలింపు ఉంటుంది.

ఎంపిక: కంప్యూటర్ ఆధారిత పరీక్ష, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్, ఫిజికల్ ఎఫిసియెన్సీ టెస్ట్, వైద్య పరీక్షలు, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఆధారంగా ఉంటుంది.

కంప్యూటర్ ఆధారిత పరీక్ష: జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్, జనరల్ నాలెడ్జ్ అండ్ జనరల్ అవేర్‌నెస్, ఎలిమెంటరీ మేథమెటిక్స్, ఇంగ్లీష్/ హిందీ నుంచి మల్టిపుల్ ఛాయిస్ తరహా ప్రశ్నలు ఉంటాయి. ఒక్కో టాపిక్ నుంచి 20 చొప్పున మొత్తం 80 ప్రశ్నలు అడుగుతారు. కరెక్ట్‌గా గుర్తించిన ప్రతి సమాధానానికి రెండు మార్కులు కేటాయిస్తారు. తప్పుగా గుర్తిస్తే ఒక్కోదానికి పావు శాతం అంటే అర మార్కు కట్ చేస్తారు. తెలుగు సహా పలు ప్రాంతీయ భాషల్లో కూడా ఈ ప్రశ్నపత్రం ఉంటుంది.

ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: డిసెంబర్ 31

వెబ్‌సైట్: https://ssc.gov.in

కేంద్ర క్యాబినెట్ సెక్రటేరియట్‌లో డిప్యూటీ ఫీల్డ్ ఆఫీసర్స్

భారత ప్రభుత్వానికి చెందిన 250 గ్రూప్-బి(నాన్ గెజిటెడ్) డెప్యూటీ ఫీల్డ్ ఆఫీసర్(టెక్నికల్) పోస్టుల నియామకాలకు నోటిఫికేషన్ విడుదలైంది. 2003/2004/2005లో సాధించిన గేట్ స్కోర్ ఆధారంగా ఈ భర్తీ జరుగనుంది.

పోస్టులు: 250(కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ-124, డేటా సైన్స్ అండ్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్-10, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/ టెలికమ్యూనికేషన్-95, సివిల్ ఇంజనీరింగ్-2, మెకానికల్ ఇంజనీరింగ్-2, ఫిజిక్స్-6, కెమిస్ట్రీ-4, మేథ్స్-2, స్టాటిస్టిక్స్-2, జియాలజీ-3)

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఇంజనీరింగ్/ టెక్నాలజీలో బ్యాచిలర్ డిగ్రీ/ సంబంధిత సబ్జెక్టులో పీజీ ఉండాలి. గేట్ వ్యాలిడ్ స్కోర్ తప్పనిసరి.

ఎంపిక: గేట్ స్కోర్, ఇంటర్వ్యూ, ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగా

దరఖాస్తుకు ఆఖరు తేదీ: డిసెంబర్ 14(పోస్టులో)

చిరునామా: పోస్ట్ బ్యాగ్ నెం.001, లోధీ రోడ్ హెడ్ పోస్టాఫీస్, న్యూఢిల్లీ - 110 003.

ప్రామాణిక మెటీరియల్‌తో ప్రాక్టీస్ ప్రధానం

జేఈఈ మెయిన్ గణితం



జేఈఈ మెయిన్‌లో ఉండే మూడు సబ్జెక్టుల్లో గణితానికి సమప్రాధాన్యం ఉన్నప్పటికీ 2022 నుంచి ఈ సబ్జెక్టు అంటే విద్యార్థులకు వెన్నులో నుంచి చలి పుడుతోంది. ఫిజిక్స్, కెమిస్ట్రీ నుంచి ఒక్కోదానిలో 23 వరకు ప్రశ్నలు సాల్వ్ చేయగలిగిన విద్యార్థులకు గణితంలో నాలుగైదు చేయడం గగనమవుతోంది. ఈ నేపథ్యంలో అలాంటి విద్యార్థులకు కొన్ని సూచనలు.

- ముందుగా ఇంటర్మీడియెట్ సిలబస్ పూర్తి చేయండి
- మెయిన్, అడ్వాన్స్‌డ్ కోసం మంచి మెటీరియల్‌ను ఉపయోగించడం చాలా అవసరం. సమీర్ బన్సల్ కాలక్యులస్, వికాస్ గుప్తా కోఆర్డినేట్ జామెట్రీ, ఎ.దాస్ గుప్తా - ప్రాబ్లమ్ ప్లస్, ఐఐటీ మ్యాథ్స్... ఇవి కాకుండా మీ టీచర్ క్లాస్ నోట్స్‌ను కచ్చితంగా ఫాలో అవ్వాలి.
- ప్రాబ్లెమ్ సాల్వింగ్ కోసం చాట్‌జీపీటీ, ఇతర ఏఐ టూల్స్‌ను ఉపయోగించవద్దు.
- ప్రతి రోజూ కనీసం 20 నుంచి 30 లెక్కలు సాల్వ్ చేయాలి.
- చివరి నిమిషంలో ఆన్‌లైన్ క్లాసులకు హాజరుకావద్దు.
- గడచిన సంవత్సరాల్లో ఇచ్చిన ప్రశ్నలను సాల్వ్ చేసే క్రమంలో, ముందుగా మీరు పూర్తి చేసిన చాప్టర్స్‌లోని ప్రశ్నలు అటెంప్ట్ చేయాలి.
- 2022 నుంచి పేపర్స్ చేస్తే సరిపోతుంది.
- సిలబస్‌లోని ప్రతి చాప్టర్‌ను చేయడం మంచిది.
- స్టాటిస్టిక్స్, సెట్స్ అండ్ రిలేషన్స్, కోఆర్డినేట్ జామెట్రీ, కాంప్లెక్స్ నంబర్స్, వెక్టర్ 3డి, మెట్రిసిస్ అండ్ డిటర్మినెంట్స్ చాప్టర్స్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలి.

పేపర్ అటెంప్ట్ వ్యూహం

- పరీక్షను లెక్కలతో మొదలుపెట్టకండి. పేపర్‌పై కొంత సమయం కేటాయించి, ఆన్సర్ చేయదగ్గ ప్రశ్నలను గుర్తించండి.
- గతంలో మాదిరిగా గణితంలో అడిగిన ప్రశ్నలు కఠినంగా ఉంటే 12 నుంచి 15 సులువుగా అనిపించినవి మాత్రమే ఆన్సర్ చేయండి
- నిడివి ఎక్కువ(లెంగ్తీ) ఉన్న ప్రశ్నలను చేయకపోవడమే మంచిది. కోర్ కాన్సెప్ట్ ప్రశ్నలు చేయగలిగితే, సమయం ఆదా అవుతుంది.
- ప్రశ్నపత్రంలో లెక్కలు కఠినంగా ఉన్నప్పటికీ ఆందోళన చెందవద్దు.
- చివరిగా, ప్రతిసారిలా కాకుండా ఈ సారి ఫిజిక్స్, కెమిస్ట్రీ కఠినంగా వచ్చినప్పటికీ అందుకు కూడా సన్నద్ధంగా ఉండండి.

- చంద్రశేఖర్ జోస్యుల
సీనియర్ ఐఐటీ మ్యాథ్స్ ఫ్యాకల్టీ

అప్రెంటిస్‌షిప్

ఐఓసీఎల్

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్(ఐఓసీఎల్) రిఫైనరీల్లో 2757 అప్రెంటిస్‌ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. గువాహటి, బరౌనీ, గుజరాత్, హల్దియా, మధుర, పానిపట్, దిగ్బోయ్, బంగాయిగావ్, పారదీప్ రిఫైనరీల్లో ఈ ఖాళీలు ఉన్నాయి.

అర్హత: పదోతరగతికి తోడు సంబంధిత విభాగంలో ఐటీఐ/ డిప్లొమా/ డిగ్రీ ఉత్తీర్ణత

వయసు: 18-24 సంవత్సరాలు

ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు ఆఖరు తేదీ: డిసెంబర్ 18

వెబ్‌సైట్: http://iocl.com/apprenticeships

పాటియాల లోకోమోటివ్ వర్క్స్



ఇండియన్ రైల్వేస్ - పంజాబ్‌లోని పాటియాలా లోకోమోటివ్ వర్క్స్‌లో 225 అప్రెంటిస్‌ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

ఖాళీలు: ఎలక్ట్రీషియన్ 120, మెకానికల్(డీజిల్) 25, మెషినిస్ట్ 12, ఫిట్టర్ 50, వెల్డర్(జీ అండ్ ఈ) 18

అర్హత: పది/ఇంటర్ ఉత్తీర్ణతకుతోడు సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ సర్టిఫికెట్ ఉండాలి.

ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు ఆఖరు తేదీ: డిసెంబర్ 22

వెబ్‌సైట్: www.plw.indianrailways.gov.in

డీఆర్‌డీఓ

డీఆర్‌డీఓ(చండీగఢ్) - ఇంజనీరింగ్/సైన్స్ - యూజీ, పీజీ విద్యార్థులకు పెయిడ్ ఇంటర్న్‌షిప్స్‌ను ఆఫర్ చేస్తోంది. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్‌లో 2, సివిల్ ఇంజనీరింగ్‌లో 1, రిమోట్ సెన్సింగ్/ జియోఇన్ఫర్మాటిక్స్‌లో 2 ఉన్నాయి. ఆరు నెలల గడువు కాగా నెలకు రూ.5000 చెల్లిస్తారు. సంబంధిత విభాగంలో ఇంజనీరింగ్ లేదంటే సైన్స్‌లో యూజీ/పీజీ ఫుల్‌టైమ్ కోర్సును యూనివర్సిటీ/ఇన్‌స్టిట్యూట్‌లో చేస్తున్న విద్యార్థులు డిసెంబర్ 15లోగా దరఖాస్తు చేసుకోవచ్చు.

వెబ్‌సైట్: director.dgree@gov.in,https://www.drdo.gov.in/drdo/sites/default/files/vacancy/advtDGRE25112025.pdf

జాబ్ కార్నర్



ఓరియెంటల్ ఇన్సూరెన్స్‌లో ఏఓ

ద ఓరియెంటల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ 300 అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పోస్టులకు దరఖాస్తులు కోరుతోంది.

పోస్టులు: జనరలిస్ట్ ఆఫీసర్ 285. హిందీ ఆఫీసర్(రాజభాష) 15

అర్హత: పోస్టును అనుసరించి కనీసం 60 శాతం మార్కులతో డిగ్రీ/ పీజీ ఉత్తీర్ణత

వయసు: ఈ ఏడాది నవంబర్ 30 నాటికి 30 సంవత్సరాలకు మించకూడదు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు ఆఖరు తేదీ: డిసెంబర్ 15

వెబ్‌సైట్: orientalinsurance.org.in

ఎస్‌బీఐలో స్పెషలిస్ట్ కేడర్ ఆఫీసర్స్

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) - 996 స్పెషలిస్ట్ కేడర్ ఆఫీసర్స్ పోస్టులకు నోటిఫికేషన్‌ను విడుదల చేసింది.

పోస్టులు: వీపీ వెల్త్ - 506, ఏవీపీ వెల్త్ - 206, కస్టమర్ రిలేషన్‌షిప్ ఎగ్జిక్యూటివ్ 284

అర్హత: డిగ్రీ ఉత్తీర్ణతకు తోడు పని అనుభవం ఉండాలి

వయసు: ఈ ఏడాది మే 1 నాటికి 20-42 మధ్య వయస్కులై ఉండాలి.

ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు చివరి తేదీ: డిసెంబర్ 23.

వెబ్‌సైట్: https://sbi.bank.in/

హెచ్‌సీఎల్‌లో 64 జూనియర్ మేనేజర్లు

కోల్‌కతాలోని హిందుస్థాన్ కాపర్ లిమిటెడ్ - టెక్నికల్ నుంచి అడ్మినిస్ట్రేషన్, హెచ్ఆర్, లా వరకు వివిధ విభాగాల్లో ఉన్న 64 జూనియర్ మేనేజర్ పోస్టులకు దరఖాస్తులు కోరుతోంది.

అర్హత: పోస్టును అనుసరించి ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, పీజీ, ఎంబీఏ ఉత్తీర్ణతకు తోడు పని అనుభవం ఉండాలి.

ఎంపిక: రాతపరీక్షకు తోడు డాక్యుమెంట్స్ వెరిఫికేషన్ ఆధారంగా. హైదరాబాద్ సహా దేశంలోని వివిధ నగరాల్లో రాత పరీక్ష జరుగుతుంది. మెడికల్ ఫిట్‌నెస్ టెస్ట్ కూడా ఉంటుంది.

ఆఖరు తేదీ: డిసెంబర్ 17

వెబ్‌సైట్: www.hindustancopper.com

రైట్స్‌లో 400 అసిస్టెంట్ మేనేజర్లు

గుర్‌గావ్‌లోని రైల్ ఇండియా టెక్నికల్ అండ్ ఎకనామిక్ సర్వీస్ లిమిటెడ్(రైట్స్)కు చెందిన నాలుగు జోన్లలో 400 అసిస్టెంట్ మేనేజర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ వెలువడింది

విభాగాలు: సివిల్, ఎలక్ట్రికల్, సిగ్నల్ అండ్ టెలీకమ్యూనికేషన్, మెకానికల్, మెటలర్జీ, కెమికల్, ఐటీ, ఫుడ్ టెక్నాలజీ, ఫార్మా

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఇంజనీరింగ్ డిగ్రీకి తోడు పనిచేసిన అనుభవం ఉండాలి.

ఎంపిక: రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా(రాత పరీక్ష వచ్చే ఏడాది జనవరి 11న జరుగుతుంది.)

పరీక్ష కేంద్రం: హైదరాబాద్ సహా దేశంలోని పలు ప్రాంతాల్లో పరీక్షను నిర్వహించనున్నారు.

దరఖాస్తుకు ఆఖరు తేదీ: డిసెంబర్ 25

వెబ్‌సైట్: www.rites.com

చిత్రజ్యోతి

SINCE 1965



డ్రాగన్ దిగుతున్నాడు

ఎన్టీఆర్ సరికొత్త లుక్‌లోకి మారారు. ఆయన ఒక సోఫాలో స్టైలిష్‌గా కూర్చొని, దట్టమైన గడ్డంతో, నల్లకళ్లద్దాలు పెట్టుకొని కనిపిస్తున్న ఫొటో ఆదివారం సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఎన్టీఆర్ సన్నబడి ఫిట్‌గా కనిపించడంతో ఆయన కొత్త లుక్ అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ప్రశాంత్‌నీల్‌తో చేస్తున్న సినిమా కోసమే ఎన్టీఆర్ కొత్త లుక్‌లో కనిపించారని తెలుస్తోంది. ఈ వారంలో హైదరాబాద్‌లో మొదలవనున్న కొత్త షెడ్యూల్‌లో భారీ యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరించనున్నారు. ఈ చిత్రానికి 'డ్రాగన్' అనే టైటిల్ ప్రచారంలో ఉంది. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్, నందమూరి కల్యాణ్‌రామ్ నిర్మిస్తున్నారు.



శశిరేఖ వచ్చేసింది

మెగాస్టార్ చిరంజీవి, దర్శకుడు అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న చిత్రం 'మన శంకర వరప్రసాద్ గారు'. నయనతార కథానాయిక. వెంకటేశ్ ముఖ్య పాత్రను పోషిస్తున్నారు. షైన్ స్క్రీన్స్, గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బేనర్లపై సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మిస్తున్నారు. సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతోంది. ఇప్పటికే విడుదలైన తొలి గీతం 'మీసాల పిల్ల' సూపర్ హిట్ అయి సినిమాపై అంచనాలను పెంచింది. తాజాగా 'శశిరేఖా...ఓ మాటే చెప్పాలి..' అంటూ సాగే మరో ప్రేమ గీతాన్ని చిత్రబృందం విడుదల చేసింది. అనంత శ్రీరామ్ రాసిన ఈ పాటను స్వీయ సంగీత దర్శకత్వంలో భీమ్స్ మధు ప్రియతో కలసి ఆలపించారు. భాను మాస్టర్ కొరియోగ్రఫీ అదిరిపోయింది. చిరంజీవి, నయనతార ఇద్దరూ తమ అభినయంతో స్క్రీన్‌ని షైమరపించారు.



హరీశ్ శంకర్ దర్శకత్వంలో పవన్ కల్యాణ్ కథానాయకుడిగా నటిస్తున్న 'ఉస్తాద్ భగత్‌సింగ్' చిత్రం నుంచి ఆదివారం క్రేజీ అప్‌డేట్ వచ్చింది. మంగళవారం ఈ చిత్రం నుంచి మొదటి పాటను విడుదల చేస్తున్నట్లు నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ తెలిపింది. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ స్టైలిష్ లుక్‌లో ఉన్న పోస్టర్‌ను విడుదల చేశారు.



రొమాంటిక్ డ్రామా

మాథ్యూ అరుళనందు ఆధ్వర్యంలో విజన్ సినిమా హౌస్ సంస్థ నిర్మిస్తున్న రొమాంటిక్ డ్రామా 'హైకు'. తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రంలో ఏగన్ హీరోగా నటిస్తున్నారు. శ్రీదేవి అపల్ల, ఫెమినా జార్జ్ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రం ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. 'యువతీయువకుల్లోని అమాయకత్వంతో కూడిన ప్రేమ, విద్యార్థి జీవితంలో ఆశలు, వారు కనే కలల నేపథ్యంలో సాగే ఫీల్‌గుడ్ రొమాంటిక్ స్టోరీ ఇది. ప్రేమలోని పవిత్రత, అందమైన స్నేహం గురించి చెబుతూ హృదయానికి హత్తుకొనే సన్నివేశాలతో సినిమా ఉంటుంది' అని దర్శకుడు యువరాజ్ చిన్నసామి చెప్పారు. 'బేబి', 'కోర్టు' చిత్రాలకు సంగీతాన్ని అందించిన విజయ్ బుల్గానిన్ ఈ సినిమాకు స్వరాలు సమకూరుస్తున్నారు.

మలయాళ దర్శకుడితో



తమిళ హీరో సూర్య కథానాయకుడిగా నటిస్తున్న 47వ చిత్రం (సూర్య 47-వర్కింగ్ టైటిల్) ఆదివారం చెన్నైలో పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. సూర్య, జ్యోతిక, కార్తీ, శివకుమార్ హాజరయ్యారు. 'రోమాంచమ్', ఆవేశం' లాంటి సూపర్‌హిట్స్ అందించిన మలయాళ దర్శకుడు జీతూ మాధవన్ దర్శకత్వం వహిస్తున్నాడు. నజ్రీయా నజీమ్ సూర్యకుజోడీగా నటిస్తున్నారు. జఘరమ్ స్టూడియోస్‌తో కలసి జ్యోతిక నిర్మిస్తున్నారు.

సందేశంతో అలరించే చిత్రం



నేటి సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న లైంగిక వేధింపుల సమస్య ఇతివృత్తంగా తెరకెక్కిన చిత్రం 'కామ అండ్ ది డిజిటల్ సూత్రాస్'. ఎన్‌హెచ్ ప్రసాద్ స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. వినయ్ వర్మ, చంద్రకళ జంటగా నటించారు. ఈ నెల 12న విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో ఎన్‌హెచ్ ప్రసాద్ మాట్లాడుతూ 'టైటిల్ బోల్డ్‌గా ఉన్నా సినిమాలో అసభ్యత ఉండదు. సున్నితమైన విషయాన్ని చర్చిస్తూ, కుటుంబంతో కలసి చూసేలా మా సినిమాను తెరకెక్కించాం. సందేశంతో పాటు వినోదం ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది' అని చెప్పారు.

గురువా నా మాటే వినరా..



కార్తి, కృతి శెట్టి జంటగా నలన్ కుమార స్వామి తెరకెక్కించిన చిత్రం 'అన్నగారు వస్తారు'. స్టూడియో గ్రీన్ బేనర్‌పై కె.ఇ.జ్ఞాన్‌వేల్ రాజా నిర్మించారు. సినిమా ఈనెల 12న విడుదలవుతోంది. తాజాగా 'అలాపిక్కే ఉమ్మక్' అనే పాటను చిత్రబృందం విడుదల చేసింది. సంతోష్ నారాయణ్ సంగీతం అందించారు. రాకేందు మౌళి పాటను రాసి ఆలపించారు. 'వలయ అహ్ కలయ, గోలయ్య, జై బాలయ్య, కలలే వలరా, గురువా నా మాటే వినరా..' అంటూ సాగే పాటకు కార్తి అదిరిపోయే స్టెప్‌లు వేశారు.

కొత్త కోణంలో కర్మ సిద్ధాంతం



వరలక్ష్మి శరత్‌కుమార్, నవీన్ చంద్ర ప్రధాన పాత్రధారులుగా సంజీవ్ మేగోటి రూపొందిస్తోన్న చిత్రం 'పోలీస్ కంప్లెయింట్'. ఎంఎస్‌కే ప్రమిద శ్రీ ఫిల్మ్స్ బేనర్‌పై బాలకృష్ణ మహారాణా నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో వరలక్ష్మి శక్తిమంతమైన పాత్రలో కనిపించనున్నారు. 'సూపర్ స్టార్ కృష్ణపై చిత్రీకరించిన ప్రత్యేక గీతం సినిమాకే హైలెట్‌గా నిలుస్తుంది. ప్రస్తుతం నిర్మాణానంతర పనులు శరవేగంగా సాగుతున్నాయి' అని నిర్మాతలు తెలిపారు. చిత్ర దర్శకుడు సంజీవ్ మేగోటి మాట్లాడుతూ "చైన్ రియాక్షన్ ఆఫ్ కర్మ' అనే ఆసక్తికరమైన కాన్సెప్ట్‌పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాం. మనం చేసే ప్రతి చర్య తిరిగి మనకు ఫలితంగా వస్తుందన్న భావనను హారర్ థ్రిల్లర్‌గా కొత్త కోణంలో చూపించబోతున్నాం' అని తెలిపారు.

పెళ్లి పీటలెక్కడం నాకు బాగుండదేమో



'నాకు ఇప్పుడు 60 ఏళ్లు. రెండు పెళ్లిళ్ల విఫలమయ్యాక, ఈ వయసులో నేను మళ్లీ ప్రేమలో పడతాననీ, నాకో తోడు దొరుకుతుందనీ నేను ఊహించలేదు. ఒంటరిగానే ఉండిపోతాననుకున్నాను. కానీ గౌరీ నా జీవితంలోకి వచ్చింది. ప్రస్తుతం మేమిద్దరం చాలా సంతోషంగా ఉన్నాం. ఆమె నాకు ఎంతో ప్రశాంతతను ఇస్తోంది' అని ఆమిర్‌ఖాన్ చెప్పారు. గౌరీ స్ప్రాట్‌తో తన ప్రేమాయణం గురించి ఓ ప్రైవేట్ కార్యక్రమంలో ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మీరు మూడో పెళ్లి ఎప్పుడు చేసుకుంటారు అని అడగ్గా, 'అధికారికంగా పెళ్లి చేసుకోవడం అనేది కేవలం ఒక తంతు మాత్రమే. మా మనసులో మేము ఎప్పుడో పెళ్లి చేసుకున్నాం. అయినా 60 ఏళ్ల వయసులో పెళ్లి పీటలెక్కడం నాకు బాగుండదేమో' అని సరదాగా స్పందించారు. రీనా దత్తా, కిరణ్‌రావులతో విడిపోయిన తర్వాత ఆమిర్, గౌరీతో రిలేషన్‌లో ఉన్నారు.

'ఇట్స్ ఓకే గురూ' అనాల్సిందే



సాయిచరణ్, ఉషశ్రీ జంటగా నటించిన చిత్రం 'ఇట్స్ ఓకే గురూ'. మణికంఠ దర్శకత్వంలో క్రాంతి ప్రసాద్ నిర్మించారు. ఈనెల 12న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. దర్శకుడు మాట్లాడుతూ 'జీవితం బాగుండాలంటే 'ఇట్స్ ఓకే గురూ' అనాల్సిందే. ఎన్ని సమస్యలు వచ్చినా 'ఇట్స్ ఓకే గురు' అనుకుంటూ ముందుకెళ్లిపోతే జీవితం చాలా బావుంటుంది అనే తాత్వికతతో ఈ చిత్రాన్ని రూపొందించాం' అని అన్నారు. నిర్మాత మాట్లాడుతూ 'దైనందిన జీవితంలో ప్రతికూల భావోద్వేగాలను ఎలా అధిగమించాలనేది ఈ సినిమాలో అద్భుతంగా చూపించాం. మా హీరో హీరోయిన్లు, దర్శకుడు ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డారు.' అని తెలిపారు. మంచి ప్రేమకథతో పాటు ఆకట్టుకునే భావోద్వేగాలు ఉన్న చిత్రమిదని సాయిచరణ్ తెలిపారు.

జగన్ హయాంలో మార్కెట్ కమిటీలు నిర్వీర్యం

- రైతుల సంక్షేమం, లింకు రోడ్ల అభివృద్ధి శూన్యం
- ఏఎంసీ చైర్మన్ల అధికారాలను రద్దు చేశారు
- రైతుల సంక్షేమమే లక్ష్యంగా కూటమి పాలన
- చైర్మన్లకు చెక్ పవర్, బి-గ్రేడ్ హోదా ఇవ్వాలి
- మంగళగిరిలో ఏఎంసీ చైర్మన్ల సదస్సు తీర్మానం



సదస్సులో పాల్గొన్న వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్లు

మంగళగిరి సిటీ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల జగన్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీలు నిర్వీర్యమయ్యాయని, చైర్మన్లకు ఉన్న అధికారాలను తొలగించి, చెక్ పవర్‌ను కూడా రద్దు చేసి కక్షసాధింపు చర్యలకు పాల్పడ్డారని వ్యవసాయ కమిటీ చైర్మన్లు ధ్వజమెత్తారు. రాష్ట్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ల సదస్సు ఆదివారం మంగళగిరిలోని ఆర్‌ఆర్ కన్వెన్షన్‌లో జరిగింది. పలువురు చైర్మన్లు జగన్ ప్రభుత్వం అనుసరించిన విధానాలను దుయ్యబట్టారు. గత టీడీపీ ప్రభుత్వంలో చైర్మన్లకు ఉన్న అధికారాలను జగన్ అధికారంలోకి వచ్చాక వుద్దేశ్యపూర్వకంగానే తొలగించారని మండిపడ్డారు. మార్కెట్ యార్డుల పరిధిలో ఉన్న లింకు రోడ్ల అభివృద్ధిని విస్మరించారని, వ్యవసాయ రంగానికి అవసరమైన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయలేదని విమర్శించారు. మార్కెట్ యార్డు చైర్మన్లకు జగన్ ప్రభుత్వం తెచ్చిన, ప్రస్తుతం అమలులో ఉన్న విధానాలను రద్దు చేయాలని, చైర్మన్లకు చెక్ పవర్‌ను పునరుద్ధరించాలని కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ చైర్మన్లను ఏ, బీ గ్రేడ్లుగా విభజించినందున, ఏఎంసీ చైర్మన్లకు బీ-గ్రేడ్ హోదా కల్పించాలని విజ్ఞప్తి చేశారు. జగన్ ప్రభుత్వం తెచ్చిన రెండేళ్ల కాలపరిమితితో నియోజకవర్గాల పరిధిలో రైతుల సంక్షేమ, అభివృద్ధి పనుల కార్యాచరణకు సమయం సరిపోదని, ఈ విధానాన్ని రద్దు చేసి ఏఎంసీ చైర్మన్ల కాలపరిమితిని మూడేళ్లకు పెంచాలని కోరారు. మార్కెట్ యార్డులకు ఆర్థిక భరోసాతో పాటు స్వయం ప్రతిపత్తిని కల్పించాలని, టీటీడీలో వారానికి ఒకరోజు చొప్పున నెలకు నాలుగు సార్లు వేంకటేశ్వరస్వామి దర్శనం సిఫారసు కోసం అవకాశం కల్పించాలని విన్నవించారు. రైతు బంధు పథకం పునరుద్ధరణతోపాటు ఉల్లి, మిర్చి, మొక్క జొన్న తదితర పంట ఉత్పత్తు లను ఆరబెట్టడం, నిల్వ చేసుకోవడానికి గోదా ములు, ఫ్లాట్‌ఫాం నిర్మాణానికి ప్రభు త్వం చర్యలు తీసుకో వాలని కోరారు. కాగా, ఏపీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ల సంఘం అధ్యక్షుడిగా నంద్యాల ఏఎంసీ చైర్మన్ గుంటుపల్లి హరిబాబు ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్రంలోని 26 జిల్లాలకు చెందిన చైర్మన్లు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు ప్రకటించారు.

సేంద్రియ వ్యవసాయంపై అవగాహన పెంచాలి

రాష్ట్రంలో వ్యవసాయ రంగానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్న నేపథ్యంలో ప్రకృతి సేంద్రియ వ్యవసాయంపై రైతుల్లో మరింత అవగాహన పెంపొందించి ప్రోత్సహించాలని రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి కోరారు. మార్కెట్ కమిటీ చైర్మన్ల సదస్సులో ఆయన ప్రసంగించారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు సారథ్యంలోప్రభుత్వం రైతులకు వెన్నుదన్నుగా అనేక కార్యక్రమాలను అమలు చేస్తుందని చెప్పారు. ఏఎంసీ చైర్మన్లు ప్రస్తావించిన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

ప్రాణం తీసిన కుటుంబాల ఘర్షణ



మృతుడు ఓర్సు పర్వతాలు

నరసరావుపేట రూరల్, డిసెం బరు 7(ఆంధ్రజ్యోతి): మండం లోని కేతముక్కల అగ్రహారంలో ఇరు కుటుం బాల మధ్య ఘర్షణలో నకరి కల్లు మండలం దేచవరం గ్రామానికి చెందిన ఓర్సు పర్వతాలు అనే వ్యక్తి అక్కడిక్కడే మృతి చెందాడు. మరో వ్యక్తి ఓర్సు కోటేశ్వరరావు తీవ్రంగా గాయపడి వైద్యశాలలో చికిత్స పొందు తున్నాడు. ఇతని పరిస్థితి విషమంగానే ఉంది. నరసరావుపేట రూరల్ సీఐ ఎం. సుబ్బారావు వివరాల మేరకు.. కేతముక్కల అగ్రహారానికి చెందిన ఓర్సు మునలయ్య, వేముల వెంకటేశ్వర్లు మధ్య స్థల వివాదం నడుస్తోంది. ఆదివారం ఇద్దరూ ఘర్షణ పడ్డారు. అనంతరం మధ్యాహ్నం వేముల వెంకటేశ్వర్లు, కుమారుడు అంకమ్మరావు పొల పనుల్లో ఉండగా.. ఓర్సు కోటేశ్వరరావు, ఓర్సు రమణయ్య, ఓర్సు హనుమంతరావు, ఓర్సు పర్వతాలు అక్కడు వెళ్లి ఘర్షణకు దిగారు. ఈ ఘర్షణలో ఓర్సు పర్వతాలు (55) అక్కడిక్కడే మృతి చెందగా, తీవ్రంగా గాయపడిన ఓర్సు కోటేశ్వరరావును నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు. వేముల వెంకటేశ్వర్లు, అతని కుమారుడు అంకమ్మరావు అక్కడి నుంచి పరారయ్యారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ కిషోర్ తెలిపారు. గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

కూచినపల్లిలో స్క్రబ్ టైఫస్

ఈపూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్క్రబ్ టైఫస్ మండలంలో కూచినపల్లిలో కలకలం రేపింది. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి స్క్రబ్ టైఫస్ జ్వరం తీవ్రత ఎక్కువ కావడంతో తలనొప్పితో పాటు కళ్లు కనిపించకుండా పోవడంతో వినుకొండ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్నాడు. గ్రామాల్లో పారిశుధ్య పనులు మెరుగుపరచడంతోపాటు అవగాహన కల్పించాలని పలువురు కోరుతున్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో ఆదివారం 43.84 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి వెయ్యి క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతున్నాయి. 4,400 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల చేస్తున్నారు.

నేడు అమరావతిలో ప్రపంచబ్యాంకు, ఏడీబీ బృందం పర్యటన

గుంటూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరాతిలో సోమవారం ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు ప్రతినిధులు పర్యటించనున్నారు. ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు, ఏపీసీఆర్డీఏ సంయుక్తంగా నిర్వహిస్తున్న జాయింట్ టెక్నికల్ మిషన్‌లో భాగంగా ఈ పర్యటన జరగనుంది. ఈ నెల 4 నుంచి 11వ తేదీ వరకు జరుగుతున్న ఈ కార్యక్రమంలో మూడు సంస్థల ప్రతినిధులు పలు అంశాలపై చర్చించారు. ఎన్జీవో ఉద్యోగుల అపార్టుమెంటు, సీడ్ యాక్సిస్ రోడ్డు(ఈ 3) రోడ్డు నిర్మాణ పనులు, తుళ్లూరులోని మరో నిర్మాణ సంస్థ క్యాంపు కార్యాలయం, ఈ-9 రోడ్డు పనులు, పెనుమాకలో వరదనీటి పనులను పరిశీలిస్తారు. నిర్మాణాల పురోగతి, ప్రమాదాల నివారణ, లేర్‌క్యాంపులు తదితర అంశాలపై చర్చిస్తారు.

న్యూకేటగిరిలో విజేత బాపట్ల ఎడ్లు



పందెపు బండను లాగుతున్న ఎడ్లజత

గురజాలటౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాతపాటేశ్వరి అమ్మవారి తిరునాళ్ల సందర్భంగా నిర్వహిస్తున్న ఎడ్ల బండలాగుడు పోటీల్లో ఆదివారం న్యూకేటగిరి విభాగంలో పోటీలు జరిపారు. బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలేనికి చెందిన అత్తోట శిరీషాచౌదరి, శివకృష్ణ చౌదరి ఎడ్లజత పందెపు బండను నిర్ణీత సమయంలో 4,422 అడుగుల దూరం లాగి విజేతగా నిలిచింది. ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం మద్దిరాల ముప్పాళ్లకు చెందిన పుచ్చకాయల శేషాద్రి చౌదరి ఎడ్లజత రెండోస్థానం, పల్నాడు జిల్లా నాదెండ్ల మండలం ఇర్లపాడుకు చెందిన మంగు రమాదేవి ఎడ్లజత మూడోస్థానం, గుంటూరు జిల్లా మేడికొండూరుకు చెందిన వెదుళ్లపల్లి శ్రీనివాసరావు, పాలడుకు చెందిన శాఖమూర్తి విజయ్ పవన్‌కుమార్ సంయుక్త ఎడ్ల జత నాలుగోస్థానం, పల్నాడు జిల్లా మాచవరం మండలం పిన్నెల్లికి చెందిన పిక్కిలి తేజశ్వి మురళి, పిడుగురాళ్లకు చెందిన కూనల రామకోటయ్య సన్స్ ఎడ్ల జత ఐదోస్థానం, గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం తోటపాలేనికి చెందిన రామినేని రత్తయ్య చౌదరి, బాపట్ల జిల్లా రేపల్లెకు చెందిన సుఖవాసి సతీష్‌బాబు సంయుక్త ఎడ్లజత ఆరోస్థానం దక్కించుకున్నాయి.

టెక్నాలజీ, ఇన్నోవేషన్‌పై నేడు వర్క్‌షాప్

అమరావతి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎంఎస్ఎంఈలకు టెక్నాలజీ, ఇన్నోవేషన్, మేధో సంపత్తి హక్కులపై సోమవారం మంగళగిరిలోని రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌లో వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు ఎంఎస్ఎంఈ, సెర్ప్ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జాతీయ పరిశోధన అభివృద్ధి సంస్థ(ఎన్ఆర్‌డీసీ), ఏపీ ఎంఎస్ఎంఈ అభివృద్ధి సంస్థ దీనిని సంయుక్తంగా నిర్వహిస్తున్నాయని తెలిపారు. రాష్ట్రంలోని ఎంఎస్ఎంఈలు, స్టార్టప్‌లలో ఆవిష్కరణ సామర్థ్యం, సాంకేతిక స్వీకరణ, మేధో సంపత్తిని పెంచే లక్ష్యంతో ఈ వర్క్‌షాప్ జరుగుతుందని పేర్కొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.70 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	143, 152, 163
చికెన్ విత్ స్కిన్(కిలో)	274.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	284.00

నేడు శబరిమలకు స్పెషల్ ట్రైన్

గుంటూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): యాత్రికుల రద్దీ దృష్ట్యా సోమవారం గుంటూరు మీదగా శబరిమలకు ప్రత్యేక రైలుని నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఎ.శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 07085 హైదరాబాద్ - కొట్టాయం స్పెషల్ రాత్రి 9.50కి బయలుదేరి సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి, చీరాల మీదగా బుధవారం వేకువజామున 5.30కి కొట్టాయం చేరుకొంటుంది. 07086 కొట్టాయం - హైదరాబాద్ స్పెషల్ ఈ నెల 10న బుధవారం ఉదయం 7.45కి బయలుదేరి చీరాల, తెనాలి, గుంటూరు, సత్తెనపల్లి మీదగా గురువారం మధ్యాహ్నం 1.35కి హైదరాబాద్ చేరుకొంటుందన్నారు.

హోర్డింగ్‌లతో.. హడల్

(5వ పేజీ తరువాయి)

పట్టడంలేదు. గుంటూరు నగరంతో పాటు పలు మున్సిపల్ పట్టణాల్లో ఎక్కడ చూసినా అనధికార హోర్డింగ్‌లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి.

చర్యలపై స్పందన శూన్యం

అనుమతులు లేకుండా ఏర్పాటు చేస్తున్న అక్రమ హోర్డింగ్‌లపై కౌన్సిల్ సమావేశాల్లో తరచూ చర్చలు జరుగుతున్నాయి. ఎక్కడికక్కడ పెద్దసంఖ్యలో ప్రకటనల బోర్డులు ఉంటున్నా ఆ మేరకు ఆదాయం లేకపోవడంపై పలువురు ప్రశ్నిస్తున్నా అధికారుల నుంచి సరైన స్పందన ఉండటంలేదన్న విమర్శలు వస్తున్నాయి. అనధికార, ప్రమాదకరంగా ఉన్న హోర్డింగ్‌లను తొలగిస్తామని, జరిమానా వసూలు చేస్తున్నామని సమాధానాలు చెప్పే అధికారులు ఆ తర్వాత వాటి గురించి పట్టించుకోవడంలేదు. బోర్డుల ఏర్పాటు చేసే సంస్థల నుంచి మామూళ్లే అధికారుల మౌనానికి కారణమన్న ఆరోపణలు ఉన్నాయి. అనధికార హోర్డింగ్‌లకు రోజుకు 50 వేల చెప్పునా జరిమానా విధించాలని ఇటీవల ప్రభుత్వం ఆదేశించింది. అయితే ఈ అదేశాలను అధికారులు అమలు చేస్తారా అన్న విషయంపై సందేహం నెలకొంది. అనుమతులు తీసుకున్న హోర్డింగ్‌లు మాత్రమే లెక్కల్లో చూపించి మిగిలిన వాటి గురించి తమకేమి తెలియదన్నట్లు అధికారులు చోద్యం చూస్తుండటంపై ప్రజల నుంచి విమర్శలు వస్తున్నాయి. గుంటూరులో అధికారకంగా 6,250 ఉండగా అనధికారికంగా 2500 పైగా హోర్డింగ్‌లు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వాటిపై నగర పాలక సంస్థ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. బాపట్లలో 52 ప్రాంతాల్లో హోర్డింగ్‌ల ఏర్పాటుకు 21 సంస్థలు అనుమతి పొందినా అనేకమంది పన్నులు చెల్లించడంలేదని అధికారులు చెప్పకనే చెబుతున్నారు. వీరికి నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది. సూర్యలంక పరిసరప్రాంతాల్లో ఎక్కువగా అనధికార హోర్డింగ్‌లు ఉన్నట్లు తెలిసింది. రేపల్లె పట్టణంలో అనుమతి పొందిన హోర్డింగ్‌లు 20 ఉండగా అనధికార హోర్డింగ్‌లు పెద్దసంఖ్యలో ఉన్నాయి.

సంతృప్తిలో.. రెవెన్యూ లోటు

(5వ పేజీ తరువాయి)

వస్తోన్న జిల్లాల్లో గుంటూరు కూడా ఒకటిగా ఉంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 57 మండలాలున్నప్పుడు ఎన్ని ఫిర్యాదులైతే వచ్చేవో విభజన జరిగిన తర్వాత కూడా అంతే స్థాయిలో వస్తున్నాయి. రెవెన్యూకి సంబంధించి మ్యుటేషన్లు, భూమి విస్తీర్ణంలో వ్యత్యాసాలు, రెవెన్యూ రికార్డులలో ఎంట్రీల కరెక్షన్స్, ల్యాండ్ పార్శిల్స్ విభజన, పట్టాదారు పాసు పుస్తకాల జారీలో జాప్యం, ఒకరి భూమిని మరొకరు ఆక్రమించడం వంటి ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయి. వీటిపై దృష్టి సారించాలని ప్రభుత్వం ఆదేశిస్తున్నా.. రెవెన్యూ అధికారులు పెద్దగా పట్టించుకోవడం లేదు. మండల స్థాయిలో రాజకీయ నాయకుల ఒత్తిళ్లకు గుర్రై నాన్చుతున్నారు. కొన్ని ఫిర్యాదులను పరిష్కరించకుండానే క్లోజ్ చేసేస్తున్నారు. ఇటీవలే ప్రభుత్వం విడుదల చేసిన గణాంకాల ప్రకారం గుంటూరు జిల్లాలో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత 20 వేలకు పైగా అర్జీలు అందాయి. దీని వలన పబ్లిక్ ఫీడ్ బ్యాక్‌లో సంతృప్తి శాతం 50 నుంచి 60 శాతం మధ్యనే ఉంటోంది. కలెక్టర్ తమీమ్ అన్సారియా బాధ్యతలు చేపట్టిన తర్వాత పీజీఆర్ఎస్‌లో కొన్ని మార్పులు తీసుకొచ్చారు. వాటి ఫలితాలు ఎలా ఉంటాయో కొద్ది రోజుల్లో తెలుస్తుంది.

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

విద్యుత్ ప్రాజెక్టు ఏఈగా త్రివేణి దేవి

రెంటచింతల, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని కృష్ణానదిపై నిర్మితమైన నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు ఏఈగా(సివిల్) త్రివేణీ దేవి బాధ్యతలు చేపట్టారు. ఈమె విజయవాడ విద్యుత్ సౌదా నుంచి ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేసిన సుజాతను విజయవాడ నార్ల తాతారావు థర్మల్ పవర్‌స్టేషన్‌కు బదిలీచేసినట్లు ఎస్‌ఈ కె.వెంకటరమణ చెప్పారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

పిడుగురాళ్ల, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న న్యాయమైన డిమాండ్‌లను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు, కార్మికులు మున్సిపల్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. వర్క్ అవుట్‌సోర్సింగ్ పేరుతో ప్రైవేటు కాంట్రాక్టర్లకు అప్పజెప్పబోయే విధానాన్ని రద్దు పరచాలని, కార్మికుల సంఖ్యను తగ్గించకూడదని, సమాన పనికి సమాన వేతనం, లేబర్ కోడ్స్‌తో కార్మికుల శ్రమను దోపిడీ చేస్తున్నారని నాయకులు తెలగపల్లి శ్రీను, బత్తుల వెంకటేశ్వర్లు, మున్సిపల్ కార్మికులు కుంభా కొండలు, కంపా రోశమ్మ, లక్షయ్య, రామారావు, పార్వతి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి నిధులు మంజూరు

నియోజకవర్గంలోని రెండు దేవాలయాలకు సీజీఎఫ్ నిధులు మంజూరయ్యాయి. పిడుగురాళ్లలోని శివాలయంకు రూ.14లక్షలు, గురజాల మండలంలోని చర్లగుడిపాడు వేణుగోపాల స్వామి దేవాలయంకు రూ.కోటి నిధులు విడుదల చేస్తూ దేవదాయశాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ప్రతిపాదనలతో ఈ నిధులు మంజూరు చేయడంతో ఆలయాల అభివృద్ధి పనులు త్వరలో చేపట్టనున్నారు.

అన్నదానం

స్థానిక కుసుమ హరనాథబాబా దేవాలయం వద్ద ఆదివారం అన్నదానం నిర్వహించారు. పట్టణానికి చెందిన యర్రం భీమిరెడ్డి కుటుంబసభ్యులు అన్నదానం చేపట్టగా కమిటీ సభ్యులు కొత్తకోటి హనుమంతరావు, వీవీ నాగేశ్వరరావు, ముడెం పెదసత్యనారాయణ, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమావేశం

స్థానిక జడ్పీ పాఠశాల 1978-79 పదో తరగతి విద్యార్థుల ఆత్మీయసమావేశం ఆదివారం జరిగింది. సుమారు 46 సంవత్సరాలకు ఆత్మీయసమ్మేళనానికి సుమారు 40మందికి పైగా పూర్వ విద్యార్థులు కలుసుకున్నారు. ఒకరినొకరు మధుర స్మృతులను గుర్తుచేసుకున్నారు. సమావేశంలో పాండురంగ శ్రీను, తాన్న రమణారావు, వేముల ఆంజనేయులు, గుడె వెంకటేశ్వరరావు, మద్దాళి శివ, తాడేపల్లి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

245 మందికి వైద్య పరీక్షలు

సత్తెనపల్లి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి ఆలయ కల్యాణ మండపంలో ఆదివారం ఆర్యవైశ్య చలివేంద్ర సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్ హైటెక్ సిటీ యశోద ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. జనరల్ ఫిజీషియన్, గుండె వైద్య నిపుణులు, కంటి వైద్య నిపుణులు, న్యూరాలజీ, ఆర్థోపెడిక్ సర్జన్‌లు శిబిరంలో 245మందిని పరీక్షించి అవసరమైనవారికి వైద్య సలహాలు అందించారు. మందులు పంపిణీచేశారు. కార్యక్రమంలో బచ్చు కొండలు, కాశీ మల్లేశ్వరరావు, సుబ్బారావు, శ్రీనివాసరావు, డాక్టర్లు సూర్యప్రకాశరావు, వెంకటస్వామి, రాజశేఖర్, రాజ తదితరులు పాల్గొన్నారు.

సత్తెనపల్లిలో సినిమా షూటింగ్ సందడి

సత్తెనపల్లి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సత్తెనపల్లి విద్యాకేంద్రం హైస్కూల్‌లో ఆదివారం బోరన్ రీ బోరన్ చిత్రాన్ని తరగతి గదుల్లో చిత్రీకరించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ డీ వెంకటేశ్వరరావు, హెచ్‌ఎం నారాయణ, వల్లెం చెన్నకేశవరావు, జే రత్నంరాజు, రమేష్, వీ జాన్, డైరెక్టర్ బీ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌ల పంపిణీ

సత్తెనపల్లి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాఘవేంద్ర బాలకుటీర్‌లో ఆదివారం శ్రీవాసవి విజ్ఞానజ్యోతి వార్షిక స్కాలర్‌షిప్‌ల పంపిణీ జరిగింది. 45మంది విద్యార్థులకు రూ.1.75లక్షల స్కాలర్‌షిప్‌లను పాఠశాల కమిటీ సభ్యులు, దాతలు అందించారు. ఈ సందర్భంగా రిటైర్డు ప్రిన్సిపాల్ వెలుగూరి సుబ్బారాయుడు మాట్లాడుతూ విద్యను ప్రోత్సహించేందుకే చదువులో ప్రతిభ చూపుతున్నవారికి స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎం గీతాంజలి, కొత్త లక్ష్మయ్య, ఏలూరి పద్మాకర్ మురళీకృష్ణ, డాక్టర్ షకిల శ్రీధర్, తడవర్తి రాంబాబు, ఎం వెంకటరావు, మధుసూదనరావు, గుర్రం ఉదయ్‌శంకర్, జవ్వాజి రామ్మోహనరావు, కే బదిరి నారాయణ, పీ ఉమామహేశ్వరరావు, వాణి తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ మండల అధ్యక్షుడిగా బాషా

నకరికల్లు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ నకరికల్లు మండల ఉపాధ్యాయ సంఘం ఆదివారం ఏర్పాటైంది. యూటీఎఫ్ నకరికల్లు మండల అధ్యక్షుడిగా ఎస్‌కేఎం బాషా, ప్రధాన కార్యదర్శిగా ఆర్ చంద్రయ్య, అసోసియేషన్ అధ్యక్షునిగా సువర్ణరాజు, అసోసియేట్‌గా పీ రజిని, ట్రెజరర్‌గా ఎం బ్రహ్మం, గౌరవ అధ్యక్షునిగా పీ యోనా ఎంపికయ్యారు.

ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్‌గా గేరా మోహనరావు

నకరికల్లు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కౌన్సిలర్‌గా చేజర్ల జెడ్పీ హైస్కూల్ మ్యాథ్స్ అసిస్టెంట్ గేరా మోహనరావును ఏకగ్రీవంగా ఎంపికైనట్టు నకరికల్లు మండల అధ్యక్షుడు సీహెచ్‌వీ నాగేశ్వరరావు తెలిపారు. ఆదివారం నరసరావుపేట ఎస్‌ఎస్‌ఎస్ కళాశాల ఆడిటోరియంలో పల్నాడు జిల్లా 79వ వార్షిక కౌన్సిల్ సమావేశం నిర్వహించినట్టు తెలిపారు. సమావేశంలో నూతన కమిటీని ఎంపిక చేసినట్టు తెలిపారు.

వైసీపీ మైనార్టీ సెల్ జిల్లా కార్యదర్శిగా బాజీ

నకరికల్లు: వైసీపీ మైనార్టీ సెల్ జిల్లా కార్యదర్శిగా షేక్ బాజీని నియమించారు. తన నియామకానికి కృషి చేసిన సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త సుధీర్‌భార్గవ్‌రెడ్డికి, భవనం రాఘవరెడ్డికి బాజీ కృతజ్ఞతలు తెలిపారు.

స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమం

మాచర్ల రూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): శ్రీరామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు మెట్టు గోవిందరెడ్డి ఆధ్వర్యాన ఆదివారం పట్టణంలోని ఫైర్‌స్టేషన్ పక్కన పీహెచ్‌సీ వద్ద ఆదివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రం పరిసరాల్లో పిచ్చి మొక్కలు, చెత్తాచెదారం తొలగించి శుభ్రపరిచారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దాక్షాయణి, సేవా సమితి సభ్యులు హరిబాబు, రుక్మిణి, సుందరమ్మ, శ్రీను, వినయ్, అజయ్ హాస్పిటల్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

వరి కుదుళ్లను కాల్చొద్దు..

రెంటచింతల,డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): వరి కోతలు ముగిసిన తరువాత కుదుళ్లను కాల్చొద్దని దీనివలన భూసారం దెబ్బతింటుందని ఏవో కట్టా లక్ష్మారెడ్డి అన్నారు. దున్నే ముందు నీటి తడులు అందించి భూమి నానిన తర్వాత అందులోనే కలియదున్నితే భూమిలో ఉండే మెగ్నీషియం, కాల్షియం, సూక్ష్మజీవులు పంటకు మేలు చేస్తాయన్నారు. అలాగే పొలంలో జీలుగ పంట వేసి కలియదున్నితే మంచి ఎరువుగా ఉపయోగపడుతుందని ఏవో సూచించారు.

నేటి నుంచి క్రీడాపోటీలు

రెంటచింతల,డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రెంటచింతలలోని సెయింట్ జోసఫ్ ఉన్నత పాఠశాలలో నేటి నుంచి విజ్ఞాన్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో బాల మహోత్సవం క్రీడా పోటీలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రెండు నియోజకవర్గాలకు చెందిన ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన బాలబాలికలు ఈ పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. క్రీడా ప్రాంగణంలో పాఠశాల పేరు రిజిస్టర్ చేయించుకోవచ్చన్నారు.



నకరికల్లు: కాశీ విశ్వేశ్వరస్వామికి తేనె, కొబ్బరి నీరు, కుంకుమ, పసుపు, చక్కెరలతో అభిషేకం చేస్తున్న దృశ్యం



పిడుగురాళ్ల: చినఅగ్రహారం శివాలయంలో అభిషేకం చేస్తున్న అర్చకులు చంద్రశేఖరశర్మ

కాశీ విశ్వేశ్వరునికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం

నకరికల్లు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): నరసింగపాడులోని అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి దేవాలయంలో ఆదివారం తెల్లవారుజామున ఆరుద్రనక్షత్రం పురస్కరించుకొని కాశీ విశ్వేశ్వరస్వామికి ప్రదోష కాల సమయాన ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. పాలు, పెరుగు, తేనె, భస్మం, కొబ్బరి నీరు, కుంకుమ, పసుపు, గంధం, ఫల రసాలతో అభిషేకాలు చేశారు. శివుని జన్మనక్షత్రం ఆరుద్ర కావటంతో శివాలయాల్లో మహన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. పూజా కార్యక్రమాలను అర్చకస్వాములు కొమ్మవరపు పవన్ కుమార్‌శర్మ, కొమ్మవరపు అప్పారావు, అర్చక స్వాములు పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

చేజర్ల కపోతేశ్వరాలయంలో...

చేజర్ల కపోతేశ్వరస్వామి దేవాలయంలో ఆదివారం తెల్లవారుజామున ప్రదోష కాలంలో కపోతేశ్వరస్వామి వారికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. సుగంధ ద్రవ్యాలతో, ఫల రసాలతో కపోతేశ్వర స్వామికి అభిషేకాలు చేశారు. పూజా కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకస్వామి కొండకావూరి వెంకట్రామయ్య శర్మ నిర్వహించారు. అనంతరం కపోతేశ్వరస్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

● పిడుగురాళ్ల, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఆరుద్ర నక్షత్రంను పురస్కరించుకొని ఆదివారం శివాలయాల్లో స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పిడుగురాళ్ల శివాలయం, నాగులగుడి, చినఅగ్రహారం గ్రామంలో ఉన్న శ్రీగంగా పార్వతి సమేత చంద్రమౌళేశ్వర స్వామి వారికి ఆలయ అనువంశిక అర్చకస్వామి వెల్లటూరి చంద్రశేఖరశర్మ ఆధ్వర్యంలో ఆరుద్ర నక్షత్ర పూజలు, అభిషేకాలు తెల్లవారుజామున నిర్వహించారు. స్వామివారికి రుద్రాభిషేకం, అన్నాభిషేకం, రుద్రహోమం, పూర్ణాహుతి నిర్వహించారు.



సమావేశంలో మాట్లాడుతున్న టీటీడీ బోర్డు సభ్యుడు కృష్ణమూర్తి

స్థానిక ఎన్నికలకు శ్రేణులు సిద్ధం కావాలి

● టీటీడీ బోర్డు సభ్యుడు కృష్ణమూర్తి

రెంటచింతల, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): రానున్న ఎన్నికలకు టీడీపీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని, అందరం కలిసికట్టుగా ఉండి పార్టీ నిర్ణయించిన అభ్యర్థిని గెలిపించుకోవాలని ఎమ్మెల్సీ, టీటీడీ బోర్డు సభ్యుడు జంగా కృష్ణమూర్తి కోరారు. ఆదివారం రాత్రి కొత్తపాలువాయి గ్రామంలో సొసైటీ చైర్మన్ అల్లం నాగలక్ష్మి స్వగృహంలో 197 బూత్‌కు సంబంధించిన కన్వీనర్లు, కార్యకర్తలు, నేతలతో ఆయన మాట్లాడారు. గత ఎన్నికల్లో ఈ బూత్‌లో వైసీపీకి భారీ మెజార్టీ వచ్చిందని, ఈ మెజార్టీని రానున్న ఎన్నికల్లో తగ్గించాలని కోరారు. వార్డుల వారీగా ఏయే సామాజిక వర్గాల వారు అధికంగా ఉన్నారు.. ఏపార్టీ వైపు మొగ్గు చూపుతారు అనే దానిపై చర్చించారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికి తిరిగి వివరించాలని, పార్టీ బలోపేతంపై ప్రతి ఒక్కరూ దృష్టి పెట్టాలని కోరారు. ఈ సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు చపారపు అబ్బిరెడ్డి, మాజీ ఎంపీపీ శొంఠిరెడ్డి నాగమ్మ నర్సిరెడ్డి, నవులూరి సాంబశివరావు, సుమంత్‌రెడ్డి, తాడపనేని కోటేశ్వరరావు, అల్లం బ్రహ్మారెడ్డి, గురులింగం యాదవ్, అప్పిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎడ్ల బలప్రదర్శన పోటీల ప్రారంభం

గురజాలటౌన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీపాతపాటేశ్వరి అమ్మవారి తిరునాళ్ల సందర్భంగా రైతు సంఘం ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ఎడ్ల బండలాగుడు పోటీల్లో ఆదివారం న్యూకేటగిరి విభాగపు పోటీలను గురజాల ప్రముఖ వైద్యుడు శ్రీనివాస్ ప్రారంభించారు. డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ 32 సంవత్సరాలుగా పోటీలను నిర్వహిస్తున్న కమిటి సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో కమిటి స భ్యులు నల్ల లక్ష్మయ్య, తన్నేటి బుచ్చిబాబు, నెల్లూరి మల్లయ్య, పోటు నాగేశ్వరరావు, విశ్వనాథం, నవులూరి శ్రీరామ్మూర్తి, చలవాది శ్రీను, షేక్ నాగుల్‌షరీఫ్ పాల్గొన్నారు.

సాగర్ నీటి సమాచారం

విజయపురిసౌత్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ జలాశయం నీటిమట్టం ఆదివారం నాటికి 578.00 అడుగులు ఉంది. ఇది 277.24 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 10 వేలు, ఎడమ కాలువ ద్వారా 8367, ఎస్‌ఎల్‌బీసీ ద్వారా 1800, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 20,167 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 20,167 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పులిచింతల...

అచ్చంపేట, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో ఆదివారం 43.84 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి వెయ్యి క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతున్నాయి. ప్రాజెక్టు వద్ద పవర్ జనరేషన్ ద్వారా 4 వేల క్యూసెక్కులు, లీకుల ద్వారా 400, మొత్తం 4,400 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల చేస్తున్నారు.

వైభవంగా పల్లకి సేవ

దుర్గి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని అడిగొప్పుల శివారులో ఉన్న నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి పల్లకి సేవ ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తెలుగు రాష్ట్రాల నుంచి భారీగా తరలి వచ్చి పూజలు నిర్వహించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ శాశ్వత ధర్మకర్త యాగంటి వెంకటేశ్వర్లు, ఈవో ఆదిశేషునాయుడు చర్యలు తీసుకున్నారు.

సత్ప్రవర్తనతో క్రీస్తు దీవెనలు

విజయపురిసౌత్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): విశ్వాసంతో క్రీస్తును ఆరాధిస్తూ సత్ప్రవర్తనతో మెలిగే భక్తులకు క్రీస్తు దీవెనలు తప్పకుండా ఉంటాయని సాగరమాత ఆలయ విచారణ గురువులు పామిశెట్టి జోసఫ్ బాలసాగర్ అన్నారు. స్థానిక సాగరమాత ఆలయంలో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. విచారణ గురువులు బాలసాగర్ ఆధ్వర్యాన దివ్యబలిపూజ నిర్వహించారు. భక్తులు భారీగా పాల్గొన్నారు.

మెగా కంటి వైద్య శిబిరం

దుర్గి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఆదివారం రోటరీ క్లబ్ ఆఫ్ మాచర్ల, శంకర కంటి ఆసుపత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యాన మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు జ్యోష్న, చరితలు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. కంటి శుక్లముల ఆపరేషన్లు అవసరమైన వారిని కాకాని శంకర కంటి ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ తుమ్మల సత్యప్రసాద్, సెక్రటరీ కోటేశ్వరరావు, ట్రెజరర్ యనమదల వెంకట్రామయ్య, డాక్టర్ కొండవీటి రామకోటయ్య, డాక్టర్ దశరథ్‌చౌహాన్, పఠాన్ నాగూర్‌వలి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సేవలో ముందుండాలి

● మున్సిపల్ చైర్మన్ మదార్‌సాహెబ్



ప్రత్యేక అవసరాల చిన్నారులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేస్తున్న చైర్మన్ మదార్‌సాహెబ్

మాచర్ల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ దివ్యాంగులు, ప్రత్యేక అవసరాల విద్యార్థుల సేవలో ముందుండాలని మున్సిపల్ చైర్మన్ షేక్ మదార్‌సాహెబ్ అన్నారు. చైతన్య వికలాంగుల సేవా సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు షేక్ అన్వర్ బాషా ఆధ్వర్యాన ఆదివారం పట్టణంలోని సూర్యకిరణ్ మానసిక వికలాంగుల పాఠశాలలో విద్యార్థులకు ప్రపంచ వికలాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని పుస్తకాలు, పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ మదార్‌సాహెబ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవా గుణాన్ని పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ పోలూరి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంలోనే అధిక దిగుబడులు



దొడ్లేరు గ్రామంలో మాగాణి పంటలో నిర్వహిస్తున్న పంట కోత ప్రయోగం


క్రోసూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించే పంటలోనే అధిక దిగుబడులు సాధ్యమని ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇన్‌చార్జ్ శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలోని దొడ్లేరు గ్రామంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన మాగాణి పంటలో ఆదివారం పంట కోత ప్రయోగాలు నిర్వహించారు. సింగంశెట్టి శివ ఆంజనేయులు పొలంలో ప్రయోగం నిర్వహించగా నిర్ణీత భూమిలో 16 కేజీలు, రసాయన ఎరువులు వాడిన బత్తుల సీతారామయ్య పొలంలో 13 కేజీల దిగుబడి లభించిందన్నారు. ప్రకృతి వ్యవసాయంలో పండిస్తున్న పంటలు రైతులకు ఆశాజనకంగాను, ఆరోగ్యకరంగాను ఉంటాయన్నారు. భూమి ఆరోగ్యం కూడా మెరుగవుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కృష్ణవేణి, షహనాజ్, అరుణ తదితరులు పాల్గొన్నారు.

10 నుంచి రాష్ట్ర స్థాయి కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్ పోటీలు

పెదకూరపాడు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయిలో ఈనెల 10వ తేదీ నుంచి కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్ క్రీడా పోటీలు పెదకూరపాడులో నిర్వహించనున్నట్టు నిర్వాహకులు, జీఆర్‌సీఆర్‌కే శ్రీచైతన్య హైస్కూల్ డైరెక్టర్ గుత్తా కవిత రాము తెలిపారు. పెదకూరపాడులో ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 10వ తేదీ నుంచి 12వరకు జరిగే ఈ పోటీల్లో రాష్ట్ర స్థాయి అండర్ - 20 విభాగంలో, వాలీబాల్ పురుషుల విభాగంలో మండడి శివరామ కాళిబాబు మెమోరియల్ సహకారంతో డే అండ్ నైట్ పోటీలు జరుగుతాయన్నారు. రాయపూడి పాపయ్య, వెంకట సుబ్బమ్మ మెమోరియల్ ఆధ్వర్యంలో కబడ్డీ పురుష, మహిళ విభాగంలో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. షటిల్ బాడ్మింటన్ పురుష విభాగంలో తూములూరి ఆదినారాయణ మెమోరియల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. విజేతలకు బహుమతులు ఇవ్వనున్నట్లు చెప్పారు. ప్రత్యేక ప్రతిభ కనబరిచినవారికి వ్యక్తిగత బహుమతులు అందిస్తామన్నారు.

ఎర్రబాలెం.. సమస్యల మయం

● అధ్వాన రహదారులు.. పారిశుధ్యం
● ప్రత్యేక పంచాయతీగా విభజించాలని గ్రామస్తుల డిమాండ్



అధ్వాన్నంగా ఉన్న అంతర్గత రహదారి



కాలువలు లేక రోడ్డు పైనే నిలిచిన మురుగు నీరు

క్రోసూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): క్రోసూరు గ్రామ పంచాయతీకి శివారుగా ఉన్న ఎర్రబాలెం గ్రామం సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతుంది. గ్రామంలో మురుగు కాలువలు లేక మురుగునీరు రోడ్ల పైనే నిలిచిపోతుంది. గ్రామంలో చెత్తాచెదారం రోడ్ల పైనే పేరుకుపోతుంది. గ్రామంలో ఉన్న శ్మశాన వాటికలు అభివృద్ధికి నోచుకోక చిట్టడవులను తలపిస్తున్నాయి. అంతర్గత రహదారులు అధ్వానంగా ఉన్నాయి. మూడు వేలు జనాభా, 1900మంది ఓటర్లు ఉన్న తమ గ్రామాన్ని ప్రత్యేక పంచాయతీగా విడగొడితేనే అభివృద్ధి సాధ్యమని గ్రామస్తులు చెపుతున్నారు. పంచాయతీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రత్యేక పంచాయతీ నినాదం గ్రామంలో ఊపందుకుంటోంది. తమ గ్రామంలో ఉన్న సమస్యలపై అక్కడక్కడ ఫ్లెక్సీలు ప్రదర్శిస్తున్నారు. ఇప్పటికే జిల్లా పంచాయతీ అధికారి, కలెక్టర్‌కు పలుమార్లు పంచాయతీలు విడగొట్టాలని వినతిపత్రాలు సమర్పించినట్టు గ్రామస్తులు తెలిపారు. సమస్యల పరిష్కారానికి తమ గ్రామానికి వచ్చిన ఆదాయాన్ని గ్రామానికే ఖర్చు పెట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. సమస్యలు పరిష్కారం కావాలంటే పంచాయతీగా గుర్తించటమే పరిష్కారమని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.



గ్రామంలో ఎక్కడ చెత్త అక్కడే...

రూ.300 విషయమై వివాదం.. గొడ్డలితో దాడి

బెల్లంకొండ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మూడు వందల రూపాయల నగదు వద్ద చిన్న వివాదం జరిగి చిలికిచిలికి గాలివానగా గొడ్డలి వేటుకు గురైన సంఘటన బెల్లంకొండ మండలంలోని పాపాయపాలెంలో ఆదివారం రాత్రి 9 గంటలకు జరిగింది. ఈ సంఘటనలో పాపాయపాలెం గ్రామానికి చెందిన ఓర్చు కృష్ణయ్యకు గొడ్డలి వేటుతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్తుల కథనం మేరకు.. ఆదివారం మధ్యాహ్నం పాపాయపాలెం గ్రామానికి చెందిన ఓర్చు కృష్ణయ్య, అదే గ్రామానికి చెందిన సంక్రాంతి కోటయ్యకు రూ 300 నగదు విషయంలో ఇరువురికి చిన్నపాటి గొడవ జరిగింది. ఆ గొడవలో సంక్రాంతి కోటయ్యను ఓర్చు కృష్ణయ్య నెట్టడంతో కిందపడ్డాడు. విషయం తెలుసుకున్న కోటయ్య కుమారుడు గోపాలకృష్ణ రాత్రి 9 గంటల సమయంలో ఎన్‌టీఆర్ బొమ్మ వద్ద కృష్ణయ్య కూర్చొని ఉండగా అక్కడికి వచ్చి మా నాన్ననే నెడతావా అంటూ గొడ్డలితో తలపై, మెడపై, నడుంపై దాడి చేశాడు. రక్తస్రావంలో తీవ్రగాయాలతో కృష్ణయ్య కుప్పకూలిపోయాడు. వెంటనే 108లో కృష్ణయ్యను సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న బెల్లకొండ ఎస్‌ఐ ప్రవీణ్ కుమార్ సంఘటనా స్థలానికి చేరుకొని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠినచర్యలు

● గురజాల డీఎస్పీ జగదీష్



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న గురజాల డీఎస్పీ జగదీష్, పట్టణ సీఐ భాస్కరరావు

దాచేపల్లి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రశాంతతకు భంగం వాటిల్లే చర్యలకు పాల్పడితే రౌడీషీటర్లపై కఠినంగా వ్యవహరిస్తామని గురజాల డీఎస్పీ జగదీష్ హెచ్చరించారు. ఆదివారం దాచేపల్లి పోలీసు స్టేషన్‌లో రౌడీషీటర్లను సమావేశ పరిచారు. ప్రతి ఒక్కరు చట్టానికి లోబడి ఉండాలని, అసాంఘిక కార్యకలాపాలకు, నేర ఘటనలకు పాల్పడినట్టు రుజువైతే కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరిని పేరు పేరున అడిగి వివరాలు సేకరించారు. పోలీసులు పిలిచిన సమయంలో తప్పనిసరిగా స్టేషన్‌కు హాజరుకావాలని ఆదేశించారు. ఎక్కడా ప్రజలను భయాందోళనలకు గురి చేయటం, చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవటం వంటి చర్యలకు పాల్పడితే సహించేది లేదన్నారు. దాచేపల్లి సీఐ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

రెంటచింతల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రౌడీషీటర్లకు ఎస్‌ఐ సీహెచ్ నాగార్జున ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. పద్ధతిగా మెలగాలని, అనవసరపు గొడవలతో జీవితాలను పాడు చేసుకోవద్దని హెచ్చరించారు. పిలిచినప్పుడల్లా స్టేషన్‌కు రావాలన్నారు.

ప్రజలకు తక్షణ న్యాయం జరిగేలా చూడాలి

● క్రోసూరు పోలీసుస్టేషన్ తనిఖీలో డీఎస్పీ హనుమంతరావు



రికార్డులను పరిశీలిస్తూ పోలీసులతో మాట్లాడుతున్న సత్తెనపల్లి డీఎస్పీ హనుమంతరావు

క్రోసూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రజలకు తక్షణ న్యాయం అందేవిధంగా అధికారులు, సిబ్బంది విధులు నిర్వహించాలని సత్తెనపల్లి డీఎస్పీ ఎం హనుమంతరావు తెలిపారు. ఆదివారం క్రోసూరు పోలీసు స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సర్కిల్ కార్యాలయాన్ని, పోలీసుస్టేషన్‌ను పరిశీలించారు. రికార్డుల నిర్వహణ విధానాన్ని పరీక్షించి అధికారులు, సిబ్బందితో మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న అండర్ ఇన్వెస్టిగేషన్ కేసులు, స్టేషన్ రికార్డులు, రిజిస్టర్లు, క్రైం రికార్డులు సక్రమంగా నిర్వహించాలన్నారు. సర్కిల్ కార్యాలయంలో పరిపాలన విధులు, రికార్డుల సంకలన విధానం, సిబ్బంది పనితీరుపై సమీక్ష జరిపారు. అండర్ ఇన్వెస్టిగేషన్ కేసులను సాధ్యమైనంత త్వరగా తగ్గించాలని, అన్ని స్టేషన్‌ల రికార్డులను ఆలస్యం లేకుండా అప్‌డేట్ చేయాలని, ప్రజలకు మెరుగైన సేవలందించేలా పనిచేయాలని ఆదేశించారు. నేర నియంత్రణ, ప్రజాభద్రత, బాధితులకు సత్వర న్యాయం అందేలా దర్యాప్తు వేగవంతం చేయాలన్నారు. విధి నిర్వహణలో క్రమశిక్షణ, పారదర్శకత పాటించాలన్నారు. రౌడీషీటర్లను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. పెదకూరపాడు సీఐ పత్తిపాటి సురేష్, క్రోసూరు ఎస్‌ఐ పీ రవిబాబు, హెడ్ కానిస్టేబుల్ దాసు, ఏఎస్‌ఐ గోపీ పాల్గొన్నారు.

ఏఎంసీ చైర్మన్‌ల మీటింగ్‌లో శోభారాణి



మంగళగిరిలో జరిగిన ఏఎంసీ చైర్మన్‌ల రాష్ట్ర సమావేశంలో పాల్గొన్న శోభారాణి

సత్తెనపల్లి రూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఏఎంసీ చైర్మన్‌ల రాష్ట్రస్థాయి సమావేశం మంగళగిరిలోని ఆర్ఆర్ఆర్ కన్వెన్షన్‌లో ఆదివారం జరిగింది. సమావేశంలో సత్తెనపల్లి ఏఎంసీ చైర్మన్ కోమటినేని శోభారాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె సమావేశంలో చర్చించిన, తీర్మానించిన అంశాలను విలేకరులకు వివరించారు. మార్కెట్ కమిటీలకు చెక్ పవర్ ఇవ్వాలని, కమిటీల పరిధిలో లింకు రోడ్ల నిర్మాణానికి నిధుల కేటాయింపు, రైతుబంధు పథకం పునరుద్ధరణ, మార్కెట్ కమిటీ చైర్మన్‌లను జిల్లాలో ప్రొటోకాల్ పరిమితి మూడేళ్లు ఉండేలా చూడటం వంటి మొత్తం పది తీర్మానాలను సమావేశంలో ఆమోదించారు. వీటిని సంబందిత శాఖ ఉన్నతాధికారులకు, సంబందిత శాఖ మంత్రికి తెలియజేసి వినతిపత్రం అందించటం, వీరిద్వారా సీఎంను కలసి తీర్మానాలు ఆమోదించేలా కోరాలని సమావేశం తీర్మానించినట్టు ఆమె తెలిపారు. సమావేశంలో ఏఎంసీ చైర్మన్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిని ఎన్నుకున్నట్టు శోభారాణి తెలిపారు.

బెల్లంకొండ క్రాస్ రోడ్డులో వాహనాల తనిఖీ

బెల్లంకొండ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): బెల్లంకొండ క్రాస్‌రోడ్డు సమీపంలో ఆంజనేయ స్వామి గుడి వద్ద ఆదివారం బెల్లంకొండ ఎస్‌ఐ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలని, అలాగే హెల్మెట్ ధరించాలని ఆయన సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, మైనర్లకు కుటుంబసభ్యులు ద్విచక్ర వాహనాలు ఇవ్వరాదని ఎస్‌ఐ పేర్కొన్నారు. అనంతరం అధిక లోడుతో వెళ్తున్న వాహనాలను ఆపి అపరాధ రుసుం వసూలు చేశారు. ఈ తనిఖీల్లో హెడ్ కానిస్టేబుల్ షణ్ముక్, సిబ్బంది ఉన్నారు.

విద్యార్థులు ఇష్టంతో చదవాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న డీడీ రాజేశ్వరమ్మ, సైకాలజిస్ట్ ప్రత్యూష సుబ్బారావు

పిడుగురాళ్ల, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టంతో కాదు.. ఇష్టపడి చదవాలని స్థానిక జడ్పీ పాఠశాలలో, డివిజన్ పరిధిలోని సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోషల్ వెల్ఫేర్ పాఠశాలల్లో ఆదివారం పది విద్యార్థులకు ప్రేరణ తరగతులు నిర్వహించారు. సోషల్ వెల్ఫేర్ డీడీ ఇ.రాజేశ్వరమ్మ మాట్లాడుతూ రాబోయే 100 రోజులు పదవ తరగతి విద్యార్థులు ప్రణాళికతో చదువుతుంటే 500కు పైగా మార్కులు సాధించడం సులువేనన్నారు. సైకాలజిస్ట్ ప్రత్యూష సుబ్బారావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఒక గమ్యాన్ని నిర్దేశించుకొని అందుకు అనుగుణంగా ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అందిపుచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో గురజాల సహాయ సాంఘిక సంక్షేమ అధికారి టీవీ సుజాతకుమారి, వార్డెన్లు నూరుల్లాబేగ్, గోపాలనాయక్, జె.అరుణకుమారి, మాధవీలత, శిరోమణి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రంలో ఆదివారం కూడా వైద్య సేవలు

నాదెండ్ల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గణపవరం గ్రామ పరిధిలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆదివారం కూడా రోగులకు వైద్య సిబ్బంది సేవలు అందించటం విశేషం. కొద్ది రోజుల క్రితం వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ వీరపాండ్యయన్ ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఆ సమయంలో ఆరోగ్య కేంద్రానికి తాళాలు వేసిన విషయాన్ని గుర్తించారు. ఈ క్రమంలో 12మంది వైద్య సిబ్బంది సస్పెన్షన్ వేటువేసిన విషయం విదితమే. ఈ క్రమంలో భాగంగా డిప్యూటేషన్‌పై వచ్చిన వైద్యులు డాక్టర్ హరిహరన్ ఆధ్వర్యంలో ఆదివారం కూడా రోగులకు సేవలు అందించారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

సెయింట్ చార్లెస్ హైస్కూల్‌లో స్పోర్ట్స్ మీట్

చిలకలూరిపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక పెదనందిపాడు రోడ్డులోని సెయింట్ చార్లెస్ హైస్కూల్‌లో ఆదివారం వార్షిక స్పోర్ట్స్ మీట్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిలుగా మున్సిపల్ ఛైర్మన్ షేక్ రఫాని, పట్టణ ఎస్ఐ చెన్నకేశవులు పాల్గొన్నారు. కార్యక్రమంలో మదర్ సుపీరియర్ సిస్టర్ శాంతి, పాఠశాల ప్రిన్సిపాల్ యం.సుప్రియ, చుక్కా విన్సెంట్ పాల్, పీడీ షేక్ బుడే పాల్గొన్నారు.

సాంఘిక సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు ప్రేరణ తరగతులు

చిలకలూరిపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక అంబేద్కర్ కాలనీలోని సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో ఆదివారం అమరావతి, నాదెండ్ల, మురికిపూడి, చిలకలూరిపేట హాస్టళ్లకు చెందిన టెన్త్ విద్యార్థులకు ప్రేరణ తరగతులు నిర్వహించారు. ముఖ్య అతిథిలుగా జిల్లా సంక్షేమ అధికారిణి ఈ రాజేశ్వరమ్మ, ఐఆర్ఎస్ అధికారి బి.రాజేశ్వరరావు పాల్గొన్నారు. విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏఎస్ డబ్ల్యూవోలు కె.తిరుపతయ్య, కె.రాజబాబు, సుబ్బారావు, సురేష్, అంకమరాజు, పాపయ్య పాల్గొన్నారు.

అస్సాం రోడ్డు ప్రమాదంలో మృతుడికి నివాళి

వినుకొండ టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): అస్సాం రాష్ట్రంలో రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వినుకొండ పట్టణానికి చెందిన హనుమత్ శాండిల్య మృతదేహానికి ఆదివారం పలువురు నివాళి అర్పించారు. శాండిల్య తండ్రి రవికుమార్ శావల్యాపురం జడ్పీహెచ్ఎస్‌లో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తుండటంతో ఆ పాఠశాల ఉపాధ్యాయులతో పాటు బ్రాహ్మణ సంఘం పెద్దలు, పూర్వవిద్యార్థులు, మృతుని స్నేహితులు, ఉపాధ్యాయ సంఘ నాయకులు పెద్దసంఖ్యలో వచ్చి ఆ కుటుంబాన్ని ఓదార్చి ప్రగాఢ సంతాపం తెలిపారు.

ఘనంగా వాగ్దేవి డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు

నరసరావుపేట టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట పట్టణం రావిపాడు రోడ్డులోని వాగ్దేవి డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కపిలవాయి రాజేంద్రప్రసాద్, కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాడెంట్ రాయల శ్రీనివాసరావు కళాశాల ఛైర్మన్ కాట్ల రామకోటేశ్వరరావు, డైరెక్టర్లు ఓగూరి నాగేశ్వరరావు, సూదా సురేష్‌బాబు, మద్దుల కోటేశ్వరరావు, పాశం కృష్ణారావు, ఇస్కేపల్లి క్రిష్ణకిషోర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాతకక్షలతో ఒకరిపై దాడి

వినుకొండ టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పాతకక్షల నేపథ్యంలో దివ్యాంగుడిపై దాడిచేసిన సంఘటన మండలంలోని పిట్టంబండలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన దివ్యాంగుడు సోమవరపు వెంకటయ్య చర్చి వద్ద కూర్చొని ఉండగా పాత కక్షల నేపథ్యంలో గ్రామానికి చెందిన సుందరరావు, సుధాకర్, వీరయ్య, పేతురు, నానిలు కలిసి దాడిచేసినట్లు వెంకటయ్య కుమారుడు సోమవరపు లక్ష్మణ్ తెలిపారు. జరిగిన సంఘటనపై వినుకొండ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

ప్రజలకు చేరువ కావటమే టీడీపీ లక్ష్యం: గంగాధర్

బొల్లాపల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు మరింత చేరువ కావటమే తెలుగుదేశం పార్టీ ముఖ్య లక్ష్యమని రాష్ట్ర నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ మద్దిరాల గంగాధర్ అన్నారు. మండలంలోని సరికొండపాలెంలో ఆదివారం బూత్‌స్థాయి కన్వీనర్లు, ఇన్‌చార్జ్‌లు, ముఖ్య నాయకులతో గంగాధర్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ బలహీనంగా ఉండటానికి గల కారణాలను తెలుసుకొని ఆ బూత్‌లను మెజార్టీ బూత్‌గా మార్చటానికి కొన్ని ముఖ్యమైన అంశాలను వారికి వివరించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపు, బూత్‌లలో అత్యధిక మెజార్టీ వచ్చే విధంగా కష్టపడి పని చేయాలన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పెమ్మసాని నాగేశ్వరరావు, టీడీపీ నాయకులు వి.బ్రహ్మం, ఎం.ఆదం, కె.ఏడుకొండలు, వెంకటనరసయ్య, విజయరాజు పాల్గొన్నారు.

కోటప్పకొండలో ఘనంగా అభిషేకాలు, హోమాలు




కర్పూర జ్యోతి దర్శనం చేసుకుంటున్న భక్తులు, ఆలయం ఎదుట భక్తుల కోలాహలం

కోటప్పకొండ (నరసరావుపేట), డిసెంబరు 7: ఆరుద్రోత్సవం సందర్భంగా కోటప్పకొండలో త్రికోటేశ్వర స్వామికి శనివారం రాత్రి అభిషేకాలు, హోమాలు ఘనంగా జరిగాయి. వివిధ సుగంధ ద్రవ్యాలతో స్వామిని అభిషేకించారు. అభిషేకాల అనంతరం స్వామికి విశేష అలంకరణ చేశారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, ఆలయ ట్రస్టీ రామకృష్ణ కొండలరావు పూజల్లో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలో బాలికల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. భక్తులు సంగీత విభావరి నిర్వహించారు. ఏర్పాట్లను ఈవో డీ చంద్రశేఖరరావు పర్యవేక్షించారు.

భక్తులకు చుక్కలు చూపించారు

ఆరుద్రోత్సవానికి భక్తులు వేల సంఖ్యలో తరలిరాగా అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేయడంలో అధికారులు విఫలమయ్యారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ఆదేశాలను అధికారులు బేఖాతర్ చేశారు. దీంతో త్రికోటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు క్యూలు లేకపోవడంతో భక్తులు తీవ్ర ఇక్కట్లు పడ్డారు. స్వామి దర్శనం అనంతరం తిరుగు ప్రయాణంలో ఘాట్‌రోడ్డులో ట్రాఫిక్ స్తంభించడంతో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గతంలో ఏన్నడూ ఇటువంటి పరిస్థితులు లేవని భక్తులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబుకు ఇక్కట్లు తప్పలేదు. దేవస్థానం గేట్లకు తాళాలు వేయడంతో ఆయన దర్శనానికి వేచిఉండాల్సి వచ్చింది. తోపులాట జరిగినా భక్తులను నియంత్రించేందుకు పోలీసులు లేరు.

పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయం

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ప్రత్తిపాటి, ఆర్యవైశ్య ప్రముఖులు

చిలకలూరిపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పొట్టి శ్రీరాములు తెలుగుజాతికోసం చేసిన త్యాగం చిరస్మరణీయమని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఆదివారం అన్నారు. రాజధానిలో ఏర్పాటుచేయనున్న పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహ ఏర్పాటుకు సంబంధించి పొట్టి శ్రీరాములు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన చర్చావేదికలో ప్రత్తిపాటి మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రం కోసం 58రోజులు ఆమరణ నిరాహారదీక్ష చేసి, మనకంటూ ఒక గుర్తింపును ఇచ్చిన మహానుభావుడు, త్యాగధనుడు పొట్టి శ్రీరాములు 58అడుగుల కాంస్య విగ్రహంతో పాటు, రాజధాని అమరావతి నడిబొడ్డున పొట్టి శ్రీరాములు స్మృతివనం, మ్యూజియం, లైబ్రరీ ఏర్పాటుచేయడం ప్రజలందరికీ గర్వకారణమన్నారు. విగ్రహ ఏర్పాటులో రాష్ట్రంలోని ఆర్యవైశ్యుల్ని భాగస్వాముల్ని చేయాలనే మంచి ఆలోచనతోనే ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ డూండీ రాకేశ్ మంచి కార్యక్రమం చేపట్టారని ఆయన ప్రశంసించారు. కార్యక్రమంలో భాగంగా ప్రత్తిపాటితో పాటు రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ డూండీ రాకేశ్, ఆర్యవైశ్య ప్రముఖులు, కూటమినాయకులతో కలిసి అమరజీవి చిత్రపటానికి పాలాభిషేకం చేసి, నివాళులు అర్పించారు. ఆర్యవైశ్య నాయకులు అత్తులూరి సుబ్బు, ఐనవోలు సాంబశివరావు, కొత్త కోటేశ్వరరావు, రాచమల్లు సూర్యారావు, కనమర్లపూడి రమేష్, అమరామణి కుమార్, గుర్రం సాంబశివరావు, చేవూరి కృష్ణమూర్తి, మమ్మీ డాడీ శ్రీను, రాచుమల్లు బద్రి, కొత్తూరి ప్రదీప్, గుప్తా, మద్ది అప్పారావు, కొలిశెట్టి రంగా, మునిసిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం ప్రారంభం

చిలకలూరిపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో దీన్ దయాళ్ శ్రవణ్ సంస్థ సహకారంతో స్థానిక ప్రత్తిపాటి గార్డెన్స్‌లో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఆదివారం ప్రారంభించారు. చెవిటి, మూగ సమస్యలతో బాధపడేవారికి ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి, అవసరమైన పరికరాలను కూడా శిబిరంలో అందిస్తారని ఈ సందర్భంగా ప్రత్తిపాటి తెలిపారు. వినికిడి సమస్యలు ఉన్న వారు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇకపై ప్రతినెలా నియోజకవర్గంలో ఎక్కడో ఒకచోట ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తామని, ప్రతి 2నెలలకు ఒకసారి క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధుల నివారణ వైద్యసేవల నిమిత్తం ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ వైద్య శిబిరంలో రికార్డు స్థాయిలో 3వేల మంది తమ పేర్లు నమోదు చేయించుకున్నారు. శిబిరంలో వైద్య పరీక్షలతో పాటు రూ.20వేల వరకు విలువైన వినికిడి పరికరాలు ఉచితంగా అందచేస్తున్నారు. కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

క్రిస్టియన్‌పాలెం, శివసంజీవయ్య కాలనీలో అధ్వాన పారిశుధ్యం

● వైసీపీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంటు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి



రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీటిని చూపిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

నరసరావుపేట రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ పండుగ దగ్గరకు వస్తున్నా ఎస్సీ, ఎస్సీ కాలనీలైన శివ సంజీవయ్య కాలనీ, క్రిస్టియన్ కాలనీలలో పారిశుధ్యం అధ్వానంగా ఉందని వైసీపీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంటు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. నరసరావుపేట పట్టణంలో ఆదివారం నిర్వహించిన గుడ్ మార్నింగ్ నరసరావుపేట కార్యక్రమంలో భాగంగా స్థానిక 5వ వార్డులోని క్రిస్టియన్‌పాలెం, శివ సంజీవయ్య కాలనీలలో డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ నరసరావుపేట పట్టణంలోని క్రిస్టియన్‌పాలెం, శివసంజీవయ్య కాలనీలలో పారిశుధ్యం దారుణంగా ఉందన్నారు. కాలువలు శుభ్రం చేసే పరిస్థితి ఎక్కడా కనబడటం లేదన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్



సమస్యను వివరిస్తున్న మహిళలు

వినుకొండటౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం రోడ్డులోని శ్రీనివాస థియేటర్ పక్క వీధిలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కారణంగా నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నట్లు స్థానికులు ఆదివారం ఆవేదన వ్యక్తం చేశారు. పాత సినిమా థియేటర్ పక్కనే ఆరడుగుల వీధిలో సుమారు 60 కుటుంబాలు నివాసం ఉంటున్నాయని, వీధిలో 2 అడుగుల రోడ్డుమార్గంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, మున్సిపల్ పైపులైన్ ఉండటంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని, చిన్నపాటి వర్షం కురిస్తే ట్రాన్స్‌ఫర్మర్ ఎర్త్ కారణంగా తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, ఇప్పటికైనా మున్సిపల్, విద్యుత్ శాఖ అధికారులు స్పందించి వీధికి అడ్డంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్చాలని మహిళలు విజ్ఞప్తి చేశారు. లేకుంటే ఆందోళను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

వ్యవసాయ సిబ్బంది నిర్లక్ష్యంతో నష్టపోతున్న రైతులు

● బీజేపీ శక్తి కేంద్రం కారుమంచి గ్రామ అధ్యక్షుడు

కారుమంచి (శావల్యాపురం) డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగుచేసిన పంటలను ఈ క్రాప్ నమోదు చేయడంలో రైతుసేవాకేంద్రం సిబ్బంది నిర్లక్ష్యంతో మండలంలోని రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని బీజేపీ శక్తి కేంద్రం గ్రామ అధ్యక్షులు సోమేపల్లి ఉమామహేశ్వరరావు ఆరోపించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో గ్రామ రైతులు 1000 ఎకరాల్లో వరి, మొక్కజొన్న పంటలు సాగుచేయగా వ్యవసాయ సిబ్బంది కేవలం 200 ఎకరాలను మాత్రమే ఈ క్రాఫ్‌లో నమోదు చేశారని, దాంతో రైతులు పండించిన పంటలను ప్రభుత్వానికి అమ్ముకొనే అవకాశాన్ని కోల్పోయారన్నారు. వరికి ప్రభుత్వ మద్దతు ధర రూ.1780 ఉండగా దళారులు కేవలం రూ.1300లకు మాత్రమే కొనుగోలు చేస్తున్నారని, దీంతో రైతులంతా తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చిందని వాపోయారు. ప్రస్తుత రబీసీజన్‌లో గ్రామానికి చెందిన రైతులు ఎక్కువగా మొక్కజొన్న, పొగాకు పంటలను సాగు చేస్తున్నారన్నారు. వ్యవసాయశాఖాధికారులు స్పందించి రబీలోనైనా రైతులు సాగుచేసిన పంటలను ఈ క్రాఫ్‌లో నమోదు చేసేలా తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

అన్నవరప్పాడు ఇన్‌చార్జ్ సర్పంచ్‌కి రూ.5 లక్షల లాటరీ

రొంపిచర్ల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నవరప్పాడు గ్రామ ఇన్‌చార్జ్ సర్పంచ్ గోపు వెంకటరెడ్డి లాటరీలో రూ.5లక్షలు ఆదివారం గెలుచుకున్నారు. బాపట్ల జిల్లా సంతమాగులూరు మండలం పుట్టావారిపాలెంలో జరిగిన రియల్ ఎస్టేట్‌కు సంబంధించిన లాటరీలో మూడు వందలమంది సభ్యుల్లో అతను ఎంపికయ్యాడు.

హత్యకేసులో నిందితుల అరెస్టు

నరసరావుపేట రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): హత్య కేసులో నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు రూరల్ సీఐ ఎం.సుబ్బారావు తెలిపారు. మండలంలోని కేశానుపల్లి పంచాయతీలో నవంబరు నెల 24వ తేదీన జరిగిన షేక్ పెద్దబాజి (34) హత్యకేసులో నిందితులు టి.బాల సుబ్రమణ్యాచారి, వి.రాంబాయమ్మలను శనివారం నరసరావుపేట బైపాస్‌రోడ్డులో అదుపులోకి తీసుకున్నట్లు రూరల్‌సీఐ సుబ్బారావు తెలిపారు. వరవకట్ట కొండలరావుపేటపేటకు చెందిన షేక్ పెదబాజి (34) ఎస్ఆర్‌కేటీ కాలనీ వద్ద టీ దుకాణం నడుపుకుంటున్నాడు. మహిళతో వివాహేతర సంబంధం నేపథ్యంలో ఆమె భర్త, ఆమె తల్లి షేక్‌బాజిని హత్యచేశారు. మృతుడి భార్య షేక్ జబీనా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నిరుపేద బ్రాహ్మణ కుటుంబాలకు నిత్యావసరాల పంపిణీ

వినుకొండ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో దాతలు రఘు, అత్యుతన స్వాతి, చింతలపూడి భద్రయ్యల సహాయ సహకారాలతో రఘుమాస్టర్ ఇంటి వద్ద మూడు నిరుపేద కుటుంబాలకు బియ్యం, నిత్యావసరాలను అందజేశారు. ముందుగా కుందుర్తి రవి ఏకైక కుమారుడు హనుమత్ శాండిల్య మరణానికి సంతాపం తెలిపారు. కార్యక్రమంలో ముటుకుల శివ,బి.రవికుమార్, జి.వి.మాధవరావు, భువనగిరి సుబ్రహ్మణ్యం, సిహెచ్.భద్రయ్య, పి.నారాయణరావు, బొడ్డచర్ల ప్రసాద్, దిట్టకవి శ్రీనివాసాచార్యులు, దేవులపల్లి విశ్వనాథశాస్త్రి పాల్గొన్నారు.

నూతన ఎస్టీయూ ఏపీ పల్నాడు జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

నరసరావుపేట టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎస్ఎస్ఎన్ కళాశాల జరిగిన 79వ జిల్లా వార్షిక కౌన్సిల్ సమావేశంలో ఎస్టీయూఏపీ పల్నాడు జిల్లా నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం జరిగింది. జిల్లా అధ్యక్షుడిగా ఎల్‌వీ రామిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఏ ఏమండి, ఆర్థిక కార్యదర్శిగా ఎస్‌కే మహబూబ్ సుభాని, గౌరవాధ్యక్షుడుగా కే.యేసయ్య ఎన్నికయ్యారు. ఎన్నికల పరిశీలకులుగా ఎస్‌కే జిలానీ వ్యవహరించారు. జిల్లా నలుమూలల నుంచి ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొని నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగింది.

రొంపిచర్ల మండల యూటీఎఫ్ కార్యవర్గం ఎంపిక

రొంపిచర్ల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రొంపిచర్ల మండల యూటీఎఫ్ కార్యవర్గాన్ని ఆదివారం ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా కే కార్మెల్ మేరి, సహాధ్యక్షుడిగా కొత్తపల్లి రవి, టీ అనూషా, ప్రధాన కార్యదర్శిగా ఎం.రామాంజనేయులు, కోశాధికారిగా ఎన్.లింగారావు, గౌరవ అధ్యక్షుడిగా సుబ్రహ్మణ్యాచారిలు ఎంపికయ్యారు. వీరితో పాటు మండల కార్యదర్శులను, జిల్లా మహా సభల ప్రతినిధులను, సీపీఎస్ కమిటీ, విద్యా విషయం కమిటీ, మహిళా విభాగం, సాంస్కృతిక, సాంకేతిక విభాగాలను, గౌరవ సలహా దారులను ఎంపిక చేశారు. నరసరావుపేటలోని ప్రాంతీయ యూటీఎఫ్ కార్యాలయంలో ఈ ఎంపికలు జరిగాయి.

'వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది సస్పెన్షన్ సరికాదు'

నరసరావుపేట కల్చరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) వైద్య, ఆరోగ్య శాఖలో ఒకేసారి 12 మంది ఉద్యోగులను సస్పెన్షన్ చేయడం తీవ్రంగా ఆందోళన కలిగించే విషయమని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షుడు స్వర్ణరామిరెడ్డి అన్నారు. ఆదివారం ఆ సంఘం ఇటీవల గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బందిని ఆ శాఖ కమిషనర్ సస్పెండ్ చేయడంపై సమావేశమైంది. సిబ్బంది మొత్తాన్ని సస్పెండ్ చేయడం సరికాదని సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ కుంచాల శ్రీనివాసరావు అన్నారు. ఉద్యోగుల వివరణ కోరకుండా ఒకేసారి సస్పెండ్ చేయడం బాధాకరమని ప్రతినిధులు తెలిపారు. సమావేశంలో ఉపాధ్యక్షులు జె.వెంకటేశ్వర్లు, జాయింట్ సెక్రటరీ షేక్ బాజీ తదితరులు పాల్గొన్నారు.

గల్లంతైన చిన్నారి కోసం ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం గాలింపు

నరసరావుపేట రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలపాడు వద్ద ఉన్న చిలకలూరిపేట మేజరులో గల్లంతైన చిన్నారి శరత్ (7 నెలలు) కోసం నరసరావుపేట రూరల్ పోలీసులు, ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది, నరసరావుపేట ఫైర్ సిబ్బంది ఆదివారం కూడా గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. రావిపాడు గ్రామం వద్ద నుంచి ఇక్కుర్రు గ్రామం వరకు చిలకలూరిపేట మేజరులో ముమ్మరంగా గాలిస్తున్నారు. ఆదివారం సాయంత్రంవరకు కూడా చిన్నారి మృతదేహం లభ్యం కాలేదు.

రోటరీ ఆధ్వర్యంలో పేదలకు సాయం

నరసరావుపేట కల్చరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని నిరుపేదలకు దుప్పట్లు, గొడుగులు, కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. రోటరీ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 3150 గవర్నర్ డాక్టర్ ఎస్.వి.రాంప్రసాద్ నరసరావుపేట రోటరీ క్లబ్‌ను విజిట్ చేసిన సందర్భంగా క్లబ్ ఆధ్వర్యంలో ఈ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టినట్లు క్లబ్ ప్రతినిధులు చెప్పారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ చేస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కరీం మొహిద్దీన్, సెక్రటరీ భవనం మునీందర్, ట్రెజరర్ కట్టమూరి అంజనేయులు, పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్లు కే.పి.రంగారావు, తాళ్ల రాజశేఖరరెడ్డి, డైరక్టర్లు షేక్ జిలాని మాలిక్, మేళ్లచెర్వు సుమిత్రా, కె.రాజేంద్రప్రసాద్, రమేష్ చంద్రదత్తు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కౌన్సిల్ సభ్యుడు ముప్పాళ్ళ నాగేశ్వరరావు, పక్కన ఎల్‌వీ రామిరెడ్డి, సీహెచ్ జోసప్ సుధీర్‌బాబు తదితరులు

రాష్ట్రంలో సంఘాలు బలంగా ఉండటం వల్లే ఉపాధ్యాయులకు మెరుగైన వేతనాలు

● సీపీఐ జాతీయ కౌన్సిల్ సభ్యుడు ముప్పాళ్ళ నాగేశ్వరరావు

నరసరావుపేట టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉపాధ్యాయ సంఘాలు బలంగా ఉండటం వల్లే చాలా రాష్ట్రాల కంటే మన రాష్ట్రంలో ఉపాధ్యాయుల వేతనాలు మెరుగ్గా ఉన్నాయని సీపీఐ జాతీయ కౌన్సిల్ సభ్యుడు ముప్పాళ్ళ నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం నరసరావుపేటలోని ఎస్ఎస్ఎన్ కళాశాల లలిత కళాప్రాంగణంలో రాష్ట్రోపాధ్యాయ సంఘం ఆంధ్రప్రదేశ్ పల్నాడు జిల్లా 79వ జిల్లా వార్షిక కౌన్సిల్ సమావేశం జరిగింది. సమావేశానికి ఎస్టీయూఏపీ జిల్లా అధ్యక్షుడు ఎల్‌వీ రామిరెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ముప్పాళ్ళ నాగేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ఎస్టీయూ ఏపీ ముందంజలో ఉందన్నారు. ఉపాధ్యాయులు బోధనేతర పనుల భారంను ఎదుర్కొంటున్నారని దీనిపై పోరాడ్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్టీఎఫ్ ఆర్థిక కార్యదర్శి సీహెచ్ జోసఫ్ సుధీర్‌బాబు, ఎస్టీయూఏపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు ఎల్‌వీ రామిరెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఎస్ఎం సుభాని, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగాధరబాబు, జిల్లా ఆర్థిక కార్యదర్శి ఎ.ఏమండి, జిల్లా ప్రధాన కార్యదర్శి యు.చంద్రజిత్‌యాదవ్, రాష్ట్ర కార్యదర్శి మద్దినేని వెంకట కోటయ్య, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కే.కోటేశ్వరరావు, కన్వీనర్ సుశీల, గేరా మోహనరావు, రాష్ట్ర ఆర్థిక కమిటీ సభ్యుడు అనిల్, శేషుబాబు, జేవీ మోహనరెడ్డి, బీఎం సుభాని, శంకరనారాయణ రసూల్, టి.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

సెలవు రోజుల్లోనూ పాఠశాలలు తగదు

● ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు హృదయ రాజు

వినుకొండ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): 100 రోజుల ప్రణాళికలతో సెలవు దినాలలో కూడా పాఠశాలలను జరిపించమనడం సహేతుకం కాదని, ఉపాధ్యాయులను బోధనేతర కార్యక్రమాలతో బోధనకు దూరం చేస్తుండడం తగదని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జి.హృదయరాజు అన్నారు. వినుకొండలో ఆదివారం జరిగిన ఏపీటీఎఫ్ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వరుసగా వారం రోజులపాటు నిరంతరం పాఠశాలలకు హాజరు కావడం ఏమాత్రం వెసులుబాటు లేకుండా ఆదివారాలు, ఇతర సెలవు దినాల్లో కూడా పాఠశాలకు హాజరు కావాలని విద్యార్థులను, ఉపాధ్యాయులను మానసిక ఒత్తిడికి గురి చేయడమేనన్నారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.చిరంజీవి మాట్లాడుతూ గత సంవత్సరం వందరోజుల ప్రణాళికలు ఇచ్చిన సీసీఎల్‌ను సైతం ఉపాధ్యాయులకు అన్నీ ఇవ్వకపోవడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వ వైఖరి పాఠశాలలను కాపాడే విధంగా లేదని, ప్రభుత్వ ప్రచార కార్యక్రమాలతో విసిగిపోయి ఉన్న ఉపాధ్యాయులను ప్రభుత్వ సెలవు దినాల్లో పనిచేయమనడం సరైన పద్ధతి కాదన్నారు. కార్యక్రమంలో ఫెడరేషన్ సీనియర్ నాయకులు కే సుబ్బారెడ్డి, జిల్లా అధ్యక్షుడు బి.సంపత్‌బాబు, గౌరవాధ్యక్షుడు పి.వెంకటరెడ్డి రాష్ట్ర అకడమిక్ కమిటీ సభ్యులు టి.శివనాగరాజు, కె.కిశోర్, వినుకొండ మండల ప్రధాన కార్యదర్శి ఈ వెంకటరెడ్డి, మండల అధ్యక్షుడు బిన్ననాయక్, జిల్లా కౌన్సిలర్ వెంకట్రావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

వినుకొండ టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనం అదుపుతప్పటంతో ఇద్దరికి తీవ్రగాయాలైన సంఘటన నరసరావుపేట రోడ్డులోని నాగిరెడ్డిపల్లి సమీపంలోని చెక్కవాగు బ్రిడ్జి వద్ద ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం ప్రకాశం జిల్లా మర్రివేముల గ్రామానికి చెందిన షేక్ నాసర్‌వలి తన ఐదు సంవత్సరాల కుమార్తె ఖైరున్‌తో కలిసి ద్విచక్రవాహంపై గుంటూరుకు వస్తుండగా నాగిరెడ్డిపల్లి సమీపంలోని చెక్కవాగు బ్రిడ్జి వద్ద వాహనం అదుపుతప్పి బ్రిడ్జిపైనుంచి కింద ఉన్న బురద గుంటలో పడి గాయపడ్డారు. స్థానికులు గమనించి 108 వాహనం ద్వారా వారిని వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. నాసర్‌వలికి మొదటి భార్య నాలుగేళ్ల క్రితం మృతిచెందడంతో ఇటీవల 2వ వివాహం చేసుకుని గుంటూరు సమీపంలోని కోళ్లఫారంలో పనిచేస్తున్నాడు. మొదటి భార్య కుమార్తె ఖైరున్‌ని తనతోపాటు తీసుకెళ్తుండగా ప్రమాదం చోటు చేసుకోవడంపై స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మద్యం మత్తు కారణంగానే ప్రమాదం జరిగి ఉండవచ్చని కుటుంబసభ్యులు భావిస్తున్నారు.

యూటీఎఫ్ నరసరావుపేట నూతన కార్యవర్గం

నరసరావుపేట టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ నరసరావుపేట, నరసరావుపేట పట్టణం నూతన కార్యవర్గ సమావేశాలు పట్టణంలోని టైనీటాట్స్ కిండర్ గార్డెన్ స్కూల్‌లో ఏ బాగేశ్వరీదేవి అధ్యక్షతన జరిగాయని జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం మోహనరావు ఆదివారం తెలిపారు. సమావేశంలో నరసరావుపేట, నరసరావుపేట పట్టణం నూతన బాధ్యులను ఎన్నుకున్నారు. యూటీఎఫ్ నూతన కార్యవర్గం గౌరవాధ్యక్షుడిగా జీ వెంకటేశ్వరరావు, అధ్యక్షుడుగా మస్తాన్ షరీఫ్, సహాధ్యక్షుడు వి.మోహన సుబ్బరాయశర్మ, కే శివపార్వతి, ప్రధాన కార్యదర్శిగా డీ కోటేశ్వరరావు, కోశాధికారిగా డీ శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. యుటీఎఫ్ పట్టణ శాఖ గౌరవాధ్యక్షుడిగా టీ ఏడుకొండలు, అధ్యక్షుడుగా ఓ కోటేశ్వరరావు, సహాధ్యక్షుడిగా సీహెచ్ సంపత్ కుమార్, ఎం.సునీత, ప్రధాన కార్యదర్శిగా ఎల్.పూర్ణచంద్రరావు, ఆర్థిక కార్యదర్శిగా ఎస్‌కే అబీబ్‌పాషా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలకు పరిశీలకులుగా యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ ఎన్.సుందరరావు, పల్నాడు జిల్లా కోశాధికారి ఎం.రవిబాబు వ్యవహరించారు. ఎన్నికైన అభ్యర్థులు ఉపాధ్యాయుల సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తామని చెప్పారు.

రామలింగేశ్వరస్వామి దేవాలయంలో రుద్రాభిషేకం

శావల్యాపురం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆరుద్ర నక్షత్రం సందర్భంగా శావల్యాపురంలోని ప్రసన్న రామలింగేశ్వరస్వామి దేవాలయంలో భక్తులు ఆదివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేకువజామున 3గంటలకే భక్తులు దేవాలయానికి చేరుకొని స్వామివారికి పాలాభిషేకాలు, క్షీరాభిషేకాలు నిర్వహించి నూతనవస్త్రాలు, రకరకాల పుష్పాలతో స్వామివారిని అందంగా అలంకరించారు. ఆలయ పూజారి రావిపాటి సాయిభరత్‌శర్మ ఆధ్వర్యంలో భక్తులు స్వామివారికి అర్చనలు, అభిషేకాలు, రుద్రాభిషేకాలు, అన్నాభిషేకాలు తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. పూజారులు భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

విద్యార్థుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి

● మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట సమీపంలోని గణపవరం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఐదుగురు విద్యార్థుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు డిమాండ్ చేశారు. వైసీపీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమవేశంలో ఆయన మాట్లాడుతూ వినుకొండ మండలం శివాపురంనకు చెందిన మెరుగు శ్రీకాంత్‌రెడ్డి, నూజెండ్ల మండలం ములకలూరు గ్రామానికి చెందిన యశ్వంత్‌సాయి, వాసు కుటుంబాలకు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. అదేవిధంగా తాళ్లూరుకు చెందిన రామిరెడ్డి, పిడుగురాళ్లకు చెందిన మహేందర్‌లు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడం బాధాకరమన్నారు. ట్రాక్టర్ లోడుతో ప్రయాణిస్తున్న లారీని ఆర్టీఏ అధికారులు జాతీయ రహదారిపై అర్ధంతరంగా ఆపడం కారణంగానే ఈ ప్రమాదం చోటు చేసుకుందని, ఇంజనీరింగ్ చదువుతున్న నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు మృతిచెందడం చాలా బాధాకరమని, ప్రమాదానికి గల కారణాలను విచారించి బాధిత కుటుంబాల త్వరితగతిన సాయం అందజేయాలని డిమాండ్ చేశారు.